www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -200 శుక్రవారం 6 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు సిద్ధం!

### మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం



**హైదరాబాద్, (ప్రజావినికిడి):**కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన 38వ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. అనంతరం మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. మూడు బ్యారేజీల ఫౌండేషన్ కటాఫ్ వాల్, డౌన్‌స్ట్రీమ్, కాంక్రీట్ డయాఫ్రం వాల్‌లో లోపాలను జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) గుర్తించి పలు సూచనలు చేసిందని మంత్రి తెలిపారు. ఎన్డీఎస్ఏ సూచించిన పరీక్షలన్నింటినీ నిర్వహించి, వాటి వివరాలను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), ఎన్డీఎస్ఏకు నివేదించినట్లు చెప్పారు. ఆయా సంస్థల సూచనల మేరకు మూడు బ్యారేజీల మిగతా2లో...

### పారా అథ్లెట్ల పోరాటం

## దేశానికి స్ఫూర్తి

**114 పతకాలతో భారత్ చరిత్రాత్మక ఘనత.. క్రీడాకారులతో ప్రధాని మోదీ ప్రత్యేక భేటీ**



**న్యూఢిల్లీ,నవంబర్ 5: (ప్రజావినికిడి):**
ఆసియా పారా గేమ్స్-2026లో భారత క్రీడాకారులు సాధించిన చారిత్రాత్మక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. పారా అథ్లెట్ల పోరాటం, పట్టుదల, అంకితభావం ప్రతి భారతీయుడికీ స్ఫూర్తినిస్తున్నాయని కొనియాడారు. గురువారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పతక విజేతలతో ప్రత్యేకంగా సమావేశమై అభినందించారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. గతంలో పిల్లలు క్రీడలను వృత్తిగా ఎంచుకోవడానికి తల్లిదండ్రులు సంకోచించేవారని గుర్తుచేశారు. మిగతా2లో...

### ఇందిరమ్మ కుటుంబాలతో

## దీపావళి..

**ప్రజాప్రతినిధులకు సీఎం పిలుపు**

**లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో నేనూ భాగస్వామినవుతా..**

**ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పాల్గొనాలి: సీఎం రేవంత్‌రెడ్డి**




## పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్!

**డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ.. ఏర్పాట్లపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష**



**హైదరాబాద్,నవంబర్ 5 (ప్రజావినికిడి):** ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఈ సదస్సు జరగనుందని వెల్లడించారు. గురువారం సచివాలయంలో సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలకు ఆహ్వానాలు పంపినట్లు, ఇప్పటికే పలు ప్రముఖ సంస్థలు పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. అంచనాలకు మించి స్పందన వస్తోందని పేర్కొన్నారు. సమ్మిట్‌లో రక్షణ, పారిశ్రామిక, ఫార్మాలైఫ్ సైన్సెస్ ఎక్స్‌పోలు మిగతా2లో...




## ఎన్నికల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**సీఈఓ సుదర్శన్‌రెడ్డికి డిప్యూటీ కలెక్టర్ల సంఘం వినతి**

**హైదరాబాద్,నవంబర్ 5: (ప్రజావినికిడి):**ఎన్నికల నిర్వహణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి గురువారం తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు) చేసిన అదనపు ఖర్చుల మిగతా2లో...

## గల్లంతైన 16 మంది సురక్షితం

**- బేతుపల్లి ఘటనపై ఉత్కంఠకు తెర..**

**అర్ధరాత్రి సాహసోపేత రెస్క్యూ ఆపరేషన్**




## అక్రమ కట్టడాలపై కవిత కన్నెర్ర!

**- నెల రోజుల్లో సమగ్ర సర్వే చేపట్టాలి..**

**లేదంటే పార్టీ తరఫున రెడ్‌మార్క్ వేస్తాం**



**హైదరాబాద్,నవంబర్ 5: (ప్రజావినికిడి):**
ఖానామెట్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించి చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు నెల రోజుల గడువు ఇస్తున్నామని, అప్పటికీ చర్యలు తీసుకోకపోతే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు రెడ్‌మార్క్ వేస్తారని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో మిగతా2లో...

### కొడంగల్‌లో మూడు రోజుల పాటు

## సీఎం రేవంత్ పర్యటన

**రూ.9,053 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..**

**50 వేల మంది రైతులతో భారీ సభ**




## ముగిసిన పరిషత్ ఎన్నికల పోలింగ్.. 7న ఓట్ల లెక్కింపు!

**చెదురుమదురు ఘటనల మధ్య ముగిసిన ఓటింగ్..**

**21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో....**



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# పారా అథ్లెట్ల పోరాటం దేశానికి స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం క్రీడారంగంలో మౌలిక సదుపాయాలు, శిక్షణ, అవకాశాలను మెరుగుపరుస్తోందన్నారు. యువత కలలు, ప్రతిభ వృథా కాకుండా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు.ఆసియా పారా గేమ్స్‌లో తొలిసారిగా 61 మంది భారత క్రీడాకారులు పాల్గొనడం విశేషమని మోదీ పేర్కొన్నారు. రెండు స్వర్ణ పతకాలు సాధించిన ఆర్చర్ శీతల్ దేవి, దృష్టిలోపాన్ని అధిగమించి అద్భుత ప్రదర్శన చేసిన అథ్లెట్ సిమ్రన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుత విజయాలతో ఆగిపోకుండా 2028 లాస్ ఏంజెలెస్ పారాలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. జపాన్‌లోని ఐచి–నగోయాలో ఇటీవల ముగిసిన ఆసియా పారా గేమ్స్‌లో భారత్ మొత్తం 114 పతకాలు సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇందులో 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలు ఉన్నాయి. గతంలో భారత్ సాధించిన 108 పతకాల రికార్డును అధిగమించి అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. ఈ విజయాల్లో 97 మంది భారత పారా అథ్లెట్లు భాగస్వాములయ్యారు.

# ఇందిరమ్మ కుటుంబాలతో దీపావళి..

**హైదరాబాద్,నవంబర్ 05(ప్రజావినికిడి):** పేదల సొంతింటి కల సాకారమైన వేళ ఈ దీపావళి పండుగను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. పేదల సొంతింటి సంతోషంలో తాను కూడా భాగస్వామిని కానున్నానని పేర్కొన్నారు.ఈ దీపావళికి తాను ఒక ఇందిరమ్మ ఇంటికి వెళ్లి లబ్ధిదారుల కుటుంబంతో కలిసి పండుగ జరుపుకోనున్నట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు కూడా తమ ప్రాంతాల్లోని ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకోవాలని కోరారు. పేద కుటుంబాల ఆనందంలో పాలుపంచుకుంటూ వారి ఇళ్లలో దీపాలు వెలిగించాలని సూచించారు.రాష్ట్రంలో తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే 2,21,500 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పేదలకు సొంతింటి భద్రత, ఆత్మగౌరవం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వేడుకలు నిర్వహించాలన్న సీఎం పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. యువ పారిశ్రామికవేత్తలు, జెన్–జీ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్ ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్, విద్యా సదస్సుతో పాటు ఏరోబాటిక్ ఎయిర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.ఇప్పటికే హైదరాబాద్, ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాలు పూర్తయ్యాయని, ప్రతినిధుల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని సంజయ్ జాజు తెలిపారు. 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగంగా ప్రపంచ పారిశ్రామికవేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులకు ఆకర్షించడమే సమ్మిట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

# ఎన్నికల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేటాయించిన బడ్జెట్ సరిపోకపోవడంతో అధికారులు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందని లచ్చిరెడ్డి వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం కొందరు అధికారులు అప్పులు చేసి ఖర్చులు భరించారని, ఇప్పటికీ ఆ మొత్తాలు తిరిగి అందలేదని తెలిపారు.

బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా అప్పులు ఇచ్చినవారు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని, కొందరు రుణదాతలు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల కార్యాలయాలు, నివాసాలకు వెళ్లి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడం వల్ల వారి గౌరవానికి భంగం కలుగుతోందన్నారు.నాంపల్లి అసెంబ్లీ, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన అదనపు వ్యయ ప్రతిపాదనలు సహా వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న బడ్జెట్ ప్రతిపాదనలను వెంటనే పరిశీలించి నిధులు విడుదల చేయాలని సంఘం కోరింది.

# అక్రమ కట్టడాలపై కవిత కన్నెర్ర!

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడిన కవిత.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో గురుకుల ట్రస్ట్‌కు చెందిన భూముల్లో 500 నుంచి 700 వరకు అక్రమ నిర్మాణాలు వెలిశాయని ఆరోపించారు. మరో 80 భవనాలు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.రిజిస్ట్రేషన్లు సాధ్యం కాని భూముల్లో నోటరీల ద్వారా లావాదేవీలు జరుపుతున్నారని, పది అంతస్తుల వరకు భవనాలు నిర్మిస్తున్నారని కవిత ఆరోపించారు. వాటిలో పీజీ హాస్టళ్లు, కళాశాలలు నిర్వహిస్తున్నారని, కనీస భద్రతా ప్రమాణాలు కూడా పాటించడం లేదని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు.అక్రమ నిర్మాణాలపై వార్తలు సేకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను భవన యజమానులు బెదిరిస్తున్నారని కవిత ఆరోపించారు. అయ్యప్ప సొసైటీలో సమగ్ర సర్వే నిర్వహించి, అనుమతులు లేని నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు అక్కడి భూములు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# పోలీసులపై ఫిర్యాదులేవీ అందలేదు!

**- జులై 20న జంతర్ మంతర్ నిరసనలపై సుప్రీంకోర్టుకు ఉన్నత స్థాయి కమిటీ నివేదిక**



**న్యూఢిల్లీ,నవంబర్ 5: (ప్రజావినికిడి):** జంతర్ మంతర్ వద్ద జులై 20న జరిగిన నిరసనల సందర్భంగా పోలీసులు అరాచకత్వానికి పాల్పడ్డారంటూ భౌతికంగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఉన్నత స్థాయి విచారణ కమిటీ (హెచ్‌పీఈసీ) వెల్లడించినట్లు సుప్రీంకోర్టు తెలిపింది. అక్టోబర్ 31న సమర్పించిన చర్యల నివేదికలో ఈ విషయం పేర్కొన్నట్లు గురువారం కోర్టు వెల్లడించింది.పోలీసుల చర్యలకు సంబంధించిన వీడియో క్లిప్పులు, ఇతర ఆధారాలను కమిటీ పరిశీలనకు సమర్పించేందుకు పిటిషనర్లకు కోర్టు అవకాశం కల్పించింది. ఫిర్యాదులను అజ్ఞాతంగా నమోదు చేసేందుకు కమిటీ ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించింది. నిరసనల సందర్భంగా పోలీసులు ఉపయోగించిన మందుగుండు సామగ్రి వివరాలను సమర్పించకపోవడంపై పిటిషనర్లు ప్రశ్నించారు.అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించి జాప్యం లేకుండా నివేదికలు ఇవ్వాలని కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. నెల రోజుల్లో తొలి నిజ నిర్ధారణ నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఫిర్యాదుల కోసం నిరవధికంగా వేచి ఉండలేమని పేర్కొంటూ, ఈ కేసుపై డిసెంబర్‌లో మరోసారి విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది.

# కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

మరమ్మతులను త్వరలోనే యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026కు సంబంధించి సీనియర్ మంత్రులు, ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర పారిశ్రామిక విధానాలు, ఇతర రంగాల్లో విధానాలను సరళీకృతం చేయడం ద్వారా ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ ముందుకెళ్తోందన్నారు. ఈ సమ్మిట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 2.25 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. ఈ నేపథ్యంలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి గ్రామ సర్పంచ్ వరకు ప్రజాప్రతినిధులంతా తమ పరిధిలోని ఒక ఇందిరమ్మ ఇంట్లో జరిగే దీపావళి వేడుకల్లో పాల్గొనాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో ముఖ్యమంత్రి కొడంగల్‌లో మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారని, మంత్రులందరూ పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలిపారు.మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న సిద్దిపేటలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి వార్డు, గ్రామపంచాయతీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. దీనితో పాటు రెండో విడత ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు చెప్పారు.రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల కోసం వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలని క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

అలాగే రాష్ట్రంలోని ఏడు ప్రాంతాల్లో రెవెన్యూ శాఖకు చెందిన భూములను అవసరాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖలకు బదిలీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కూడా క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి వివరించారు.

# గల్లంతైన 16 మంది సురక్షితం

**సత్తుపల్లి,**నవంబర్ 5(ప్రజావినికిడి)::ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్దచెరువు వద్ద బుధవారం సాయంత్రం మొదలైన ఉత్కంఠ చివరకు సుఖాంతమైంది. చెరువులో చిక్కుకున్న ఎనిమిది మంది మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎన్డీఆర్ఎఫ్ బృందం పడవ బోల్తా పడటంతో మత్స్యకారులతో పాటు సహాయక సిబ్బంది కూడా చెరువులో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగి అర్ధరాత్రి వరకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాయి. చీకటిని సైతం లెక్కచేయకుండా మొత్తం 16 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి.రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అందరూ క్షేమంగా బయటపడ్డారు. ఘటన జరిగినప్పటి నుంచి కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రాత్రంతా చెరువు వద్దే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ సూచనలు అందించారు. రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి కృషిని, జిల్లా అధికారుల పనితీరును ప్రశంసిస్తూ రెస్క్యూ బృందాలకు ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు.

# కొడంగల్‌లో మూడు రోజుల పాటు సీఎం రేవంత్ పర్యటన

**హైదరాబాద్నవంబర్ 5: (జర్నలిస్టు జర్నీ న్యూస్):**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 7, 8, 9 తేదీల్లో తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించడంతో పాటు రూ.9,053.48 కోట్లతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అలాగే రూ.46.08 కోట్లతో నిర్మించిన 10 ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు.ఈ నెల 7న హకీంపేటలో మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను సీఎం ప్రారంభిస్తారు. రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమై ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ అవకాశాలపై చర్చిస్తారు. పారిశ్రామికవేత్తలతోనూ సమావేశం కానున్నారు.8న స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారు. రూ.5,060 కోట్ల రేడియల్ రోడ్డు, రూ.2,100 కోట్ల ఎత్తిపోతల పథకం రెండో దశ, రూ.1,410 కోట్లతో 223 బీటీ రహదారుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వ్యవసాయ కళాశాల, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, ఆధునిక బస్టాండ్లు తదితర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

పూర్తయిన పాఠశాలలు, కళాశాలలు, పోలీస్ స్టేషన్లు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ భవనాలను కూడా ప్రారంభిస్తారు.పర్యటన చివరి రోజైన 9న హకీంపేటలో భారీ రైతు బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ఈ సభకు పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు సభా ప్రాంగణం, రైతుమేళా, పారిశ్రామిక ప్రదర్శన వద్ద ఏర్పాట్లు ముమ్మరం చేశారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు.

# ముగిసిన పరిషత్ ఎన్నికల పోలింగ్.. 7న ఓట్ల లెక్కింపు!

**- చెదురుమదురు ఘటనల మధ్య ముగిసిన ఓటింగ్.. 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో**



**అమరావతినవంబర్ 5: (ప్రజావినికిడి):**ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ గురువారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. ఉదయం పలు ప్రాంతాల్లో వర్షాల కారణంగా పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్నవారికి కూడా ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సుమారు 21,012 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 65 నుంచి 68 శాతం వరకు ఓటింగ్ నమోదై ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మధ్యాహ్నం 1 గంటకు 30.50 శాతంగా ఉన్న పోలింగ్.. ఆ తర్వాత వేగం పుంజుకుంది. రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైనట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్తతలుపోలింగ్ సందర్భంగా పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు చోటుచేసుకున్నాయి. రిగ్గింగ్, నకిలీ ఓట్ల ఆరోపణలతో రాజకీయ పార్టీలకు చెందిన వర్గాల మధ్య వాగ్వాదాలు జరిగాయి. కొన్ని చోట్ల కర్రలు, రాళ్లతో దాడులకు పాల్పడినట్లు సమాచారం. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ, పోలింగ్ ప్రక్రియ పెద్దగా అంతరాయం లేకుండా ముగిసింది.పోలింగ్ పూర్తయిన వెంటనే అధికారులు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేశారు. వాటిని కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఎన్నికల సంఘం వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తోంది. ఎక్కడైనా తీవ్రమైన అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే నవంబర్ 6న రీపోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది.నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. అనంతరం నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో పరిషత్ ఎన్నికల తుది ఫలితాలపై రాజకీయ పార్టీలతో పాటు అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది.

# ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగింపు

**● ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియకు అదనపు సమయం**




**న్యూఢిల్లీ,నవంబర్ 5: (ప్రజావినికిడి):**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మరింత విస్తరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హర్యానా, నాగాలాండ్‌తో పాటు ఢిల్లీలో ఈ ప్రక్రియకు సంబంధించిన గడువులను పొడిగించింది. తెలంగాణలో ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి నవంబర్ 26 వరకు గడువు ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్, హర్యానాలో నవంబర్ 20 వరకు, నాగాలాండ్‌లో నవంబర్ 25 వరకు గడువు పొడిగించింది. మహారాష్ట్రలో అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణను డిసెంబర్ 13 వరకు కొనసాగించనున్నారు. ఈ రాష్ట్రాల్లో తుది ఓటరు జాబితాలను నవంబర్ 30న ప్రకటించనున్నారు.ఢిల్లీలో అభ్యంతరాల స్వీకరణ గడువును డిసెంబర్ 25 వరకు పొడిగించగా, తుది ఓటరు జాబితాను డిసెంబర్ 22న విడుదల చేయనున్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన వారందరికీ అవకాశం కల్పించడంతో పాటు అభ్యంతరాలను పరిష్కరించేందుకు ఈ గడువు పొడిగింపు చేపట్టినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

శుక్రవారం 6 నవంబర్ 2026

# కవాడిగూడ సర్కిల్లో అక్రమ నిర్మాణాల దందా..

## కూల్చివేతలు.. సీజ్‌లు ఉత్తుత్తి తంతులేనా.?

**ఒకసారి కూల్చివేత, మరోసారి సీజ్, అయిన ఆగని నిర్మాణాలు..**

**ఏసీపీ శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ క్రిష్ణయ్య అవినీతి తీరుపై స్థానికుల ఆగ్రహం..**

**లక్షల్లో చేతులు మారుతున్నాయంటూ తీవ్ర ఆరోపణలు, ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి..**

**సెక్షన్ ఆఫీసర్ల, ఏసీపిల అవినీతి, అక్రమాలను పట్టించుకోని జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్లు..**







**హైదరాబాద్,(ప్రజావినికిడి):**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతామని జీహెచ్ఎంసీ అధికారులు చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో మాత్రం నీటిమూటలుగా మారుతున్నాయనేవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ముఖ్యంగా కవాడిగూడ సర్కిల్-40 పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ఒకసారి కూల్చివేతలు చేపట్టడం, మరోసారి నిర్మాణాన్ని సీజ్ చేయడం,ఆ తర్వాత తిరిగి అదే నిర్మాణాలు పూర్తవడం వెనుక అసలు మర్మమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కవాడిగూడ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన ఏసీపీ శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ క్రిష్టయ్య తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నారా.? లేక అక్రమ నిర్మాణదారులకు పరోక్షంగా అవకాశం కల్పిస్తున్నారా.? లంచాలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారా.? అన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.అధికారులు చర్యలు తీసుకున్నట్లు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం నిర్మాణాలు పూర్తవుతుండటంతో జీహెచ్ఎంసీ ఉన్నత అధికారుల చర్యలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### కూల్చివేతలు చేసినా,మళ్లీ నిర్మాణాలు ఎలా.?

ఒకసారి కూల్చివేతలు చేపట్టిన నిర్మాణాలు తిరిగి ఎలా నిర్మాణ పనులు పూర్తవుతున్నాయి.? సీజ్ చేసిన భవనాల్లో మళ్లీ పనులు కొనసాగుతుంటే టౌన్ ప్లానింగ్ ఏసిపి,సెక్షన్ ఆఫీసర్,టైల్ మెన్ అధికారులు ఏం చేస్తున్నారు.? సీజ్ చేసిన తర్వాత కూడా నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులు గుర్తించలేదా.? గుర్తించినా ఎందుకు అడ్డుకోలేకపోయారు.? నిర్మాణాల వద్ద అనుమతి పత్రాలు ఎందుకు అందించడం లేదు అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. లక్షల రూపాయల్లో ముడుపులు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆరోపణల్లో వాస్తవాలను వెలికితీసేందుకు ఉన్నతాధికారులు ఏసీబీ అధికారులచే విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

### కమిషనర్ కర్ణన్‌కు కనిపించని అక్రమ నిర్మాణాలు.?

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆయన ఏ రోజు పట్టించుకున్న దాఖలాలు లేవని ఇదే అదనుగా సిసిపి,జోనల్ సీసీపీలు,జోనల్ కమిషనర్లు పూర్తి నిర్లక్ష్యం బాధ్యతారాహిత్యం వహించడంతో నగరంలో అక్రమ నిర్మాణాల చోరు పెరుగుతూ పర్యావరణానికి ముప్పుగా మారుతుంది. స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం పేరుతో కాలక్షేపం చేయడం క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు మాత్రం భిన్నంగా కనిపిస్తున్నాయి. సికింద్రాబాద్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాల్సిన జోనల్ కమిషనర్ పనితీరు ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.సర్కిల్ స్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారులు తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షించాల్సిన డిప్యూటీ,జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు ఏ మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నారు.? ఫిర్యాదులపై ఎందుకు సమర్థవంతమైన చర్యలు కనిపించడం లేదు.? అని ఫిర్యాదుదారులు ప్రశ్నిస్తున్నారు.

### ప్రభుత్వ ఖజానాకు గండి, బాధ్యులపై చర్యలేవి.?

అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, భవిష్యత్తులో రహదారులు, డ్రైనేజీలు, పార్కింగ్,మౌలిక సదుపాయాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం పడుతుంది. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన వ్యవస్థలోనే లోపాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై విజిలెన్స్,ఏసీబీ విచారణ జరిపించాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవినీతిపై కఠినంగా వ్యవహరిస్తామని చెబుతున్న నేపథ్యంలో కవాడిగూడ సర్కిల్-40 వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే కూల్చివేతలు, సీజ్‌లు జరిగిన నిర్మాణాలపై పూర్తి వివరాలు సేకరించి,తిరిగి నిర్మాణాలు ఎలా పూర్తవుతున్నాయి.అధికారులు ఎంత లంచాలు తీసుకున్నారని విచారణ చేసి తేల్చాలి. బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. లేదంటే అక్రమ నిర్మాణదారులకు అధికారులే రక్షణ కవచాలుగా మారుతున్నారన్న ప్రజల అనుమానాలకు మరింత బలం చేకూరే ప్రమాదం ఉంది.మరి సికింద్రాబాద్ జోన్ జోనల్ కమిషనర్, జిహెచ్ఎంసి కమిషనర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# నవంబర్ 13న ప్రభుత్వ పాఠశాల భూ పరిరక్షణకు భారీ ర్యాలీ :జేఏసీ




**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):**

ప్రగతి నగర్ జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భూ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పాఠశాల భూమి పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు.ఈ సందర్భంగా 2026 నవంబర్ 13వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో భారీ స్కూల్ పరిరక్షణ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.పాఠశాల స్థలాన్ని శాశ్వతంగా ప్రభుత్వ ఆధీనంలో పరిరక్షించాలని, ఆక్రమణ ఆరోపణలపై విచారణ జరిపించాలని, పాఠశాలకు అవసరమైన నిధులు,మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులను కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాల భూమిని కాపాడుకుందాం విద్యార్థుల భవిష్యత్తును రక్షించుకుందాం అనే నినాదంతో జరిగే ఈ ర్యాలీలో ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జేఏసీ నాయకులు ఆకుల సతీష్, వెంకటరామయ్య,మేడా శ్రీనివాస్, మల్యాల రమణి, మురళి, తులసిదాస్, లోకంనాథం, ఎల్లస్వామి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కేఎం.పాండు విగ్రహానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాంబశివారెడ్డి

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**




కుత్బుల్లాపూర్ రాజకీయ పితామహుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ స్వర్గీయ కేఎం.పాండు 8వ వర్ధంతిని పురస్కరించుకొని చింతల్‌లోని కేఎం.పాండు మార్గ్ వద్ద నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో కేఎం పాండు తలయుడు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద తోపాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వర్గీయ కేఎం.పాండు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి స్వర్గీయ కేఎం.పాండు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుచూపుతో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అక్షరాస్యతతోనే పేద ప్రజల జీవితాల్లో నిజమైన వెలుగులు నిండుతాయని బలంగా విశ్వసించి, విద్యకు విశేష ప్రాధాన్యతనిస్తూ ఎన్నో కుటుంబాల జీవితాల్లో మార్పునకు కృషి చేసిన మహానేత అని కొనియాడారు.రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేసుకున్న కేఎం.పాండు , ఎంతోమందికి రాజకీయంగా అవకాశాలు కల్పిస్తూ, ప్రజాసేవకు మార్గదర్శకంగా నిలిచారని అన్నారు. ఆయన ప్రజాసేవా స్ఫూర్తిని, ఆశయాలను కొనసాగిస్తూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి,ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ పార్టీల నాయకులు, మహిళా నాయకురాళ్లు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొని స్వర్గీయ కేఎం.పాండు కి ఘనంగా నివాళులర్పించారు.

# 82 ఏళ్ల వయసులోనూ రోబోటిక్ మోకాలి మార్పిడి..

**నొప్పి లేకుండా నడిచిన వృద్ధురాలు**

**చంపాపేట్ ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్‌లో అరుదైన ఘనత**




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**

నవంబర్ 5, చంపాపేట్‌లోని ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్‌లో 82 ఏళ్ల కౌసల్యకు విజయవంతంగా రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. సీనియర్ రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బాలరాజు నాయుడు ఈ శస్త్రచికిత్సను నిర్వహించారు. దీర్ఘకాలంగా మోకాలి ఆర్థరైటిస్‌తో బాధపడుతూ నడవడానికి ఇబ్బంది పడుతున్న కౌసల్యకు రోబోటిక్ టెక్నాలజీతో శస్త్రచికిత్స నిర్వహించిన అనంతరం నొప్పి లేకుండా నడవగలిగే స్థితికి చేరుకున్నారని డాక్టర్ బాలరాజు నాయుడు తెలిపారు. కౌసల్య కుమారుడు, సీనియర్ డెంటల్ సర్జన్ డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ, తమ తల్లికి అత్యుత్తమ వైద్యసేవలు అందించిన ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. 82 ఏళ్ల వయసులోనూ ఆమె వేగంగా కోలుకోవడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ రోబోటిక్స్‌తో పాటు జపాన్ క్యాథ్ ల్యాబ్, జర్మన్ 128 స్లైస్ సీటీ స్కాన్,1.5 టెస్లా ఎంఆర్ఐ వంటి అధునాతన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి

# ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

**కాలుష్య కొరలనుండి ప్రజలను రక్షించాలి : బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షులు -బొంగు వెంకటేష్ గౌడ్**





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ గురువారం నాడు బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ నుంచి ఆటోనగర్ డంపింగ్ యార్డ్ వరకు పాదయాత్ర నిర్వహించారు.డంపింగ్ యార్డ్ వద్దకు చేరుకున్న బీసీ పీపుల్స్ ఫెడరేషన్ నాయకులు అక్కడి పరిస్థితులను పరిశీలించి,చెత్త నిల్వ,వ్యర్థ పదార్థాల నిర్వహణ, దుర్వాసన,పొగ, కాలుష్యానికి సంబంధించిన సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, ఆటోనగర్ డంపింగ్ యార్డ్ కారణంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసన, విషపూరిత పొగ, గాలి కాలుష్యం, వ్యర్థాల వల్ల నీటి కాలుష్యం వంటి సమస్యలు ప్రజల జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వందలాది కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతంలో ఇలాంటి డంపింగ్ యార్డ్ కొనసాగడం వల్ల ప్రజలు నిత్యం ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు సహా స్థానిక ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించాలని కోరారు.జీహెచ్ఎంసీ అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని,గాలి, నీటి నాణ్యతను పరీక్షించాలని, పర్యావరణ నిబంధనలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాలని డిమాండ్ చేశారు.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను పూర్తిస్థాయిలో తరలించే వరకు బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుంది. అవసరమైతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని బొంగు వెంకటేష్ గౌడ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు జలమోని రవీందర్ ముదిరాజ్, కొంగరి కృష్ణ,బంజారా జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కే.గాంధీ నాయక్,బీఆర్ ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు చిప్పలపల్లి యాదగిరి,తెలుగు యువత రాష్ట్ర నాయకులు నకిరేకంటి,శ్రీకాంత్,చిప్పలపల్లి నరేందర్, చిప్పలపల్లి సురేష్,చేగూరి పరమేష్ జై భారత్ జాతీయ ఉపాధ్యక్షులు ఖదిజ్ఞాసి వంశీ,తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఖదిజ్ఞాసి రాజు,సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సైదయ్య,జై భారత్ సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర కార్యదర్శి హైకోర్టు న్యాయవాది ఖదిజ్ఞాసి గణేష్ గల్లా జై భారత్ ఎస్సి పోరాట వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఖదిజ్ఞాసి మధు మాదిగ జై భారత్ ఎస్సి బిసి ఎస్టి పోరాట వేదికల నాయకులు పాండు,గురువయ్య, శ్రీనివాస్ పిట్ల తదితరులు పాల్గొన్నారు

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక




# ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నాం..

## బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు కుత్బుల్లాపూర్ సంక్షేమ ప్రదాత, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు.

# కె.ఎం.పాండు 8వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి





**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ మాజీ సర్పంచ్, తొలి మున్సిపల్ చైర్మన్, కీర్తిశేషులు కె.ఎం. పాండు 8వ వర్ధంతి కార్యక్రమం చింతల్,బాపు మార్ట్ లో ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ తో కలిసి 286 డివిజన్ బిఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు పాల్గొని,పాండు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కుంట సిద్ధిరాములు మాట్లాడుతూ, కె.ఎం.పాండు చేసిన ప్రతి కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడిందని,వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతి యువకుడు ముందుకు వచ్చి, వారిలాగే ప్రజలకు సేవా కార్యక్రమాలు అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజకీయాల్లో.. విమర్శలే లక్ష్యం కాకూడదు!

## కెసిఆర్,కేటీఆర్,హరీష్ రావులు పదేపదే ఉత పదాలను వాడటం సరైన పద్ధతి కాదు.

## రాజకీయాల్లో హుందాతనం ఉండాలి తప్ప వ్యక్తిగత విమర్శలు తగువు.

## తెలుగుదేశం పార్టీ పాలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు..!



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రాజకీయాల్లో ఉండాలంటే ప్రజా సమస్యలపై మాట్లాడాలి,ప్రజలకు సేవ చేయాలి.రాజకీయ విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలి తప్ప వ్యక్తిగత విమర్శలు,అనవసర ఆరోపణలే లక్ష్యంగా మారకూడదు అని తెలుగుదేశం పార్టీ పాలిట్ బ్యూరో సభ్యుడు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,భారతీయ ఇతిహాసాల్లో భరతుడు మనకు గొప్ప ఆదర్శంగా నిలిచాడు. శ్రీరామచంద్రుడు అరణ్యవాసానికి వెళ్లినప్పుడు భరతుడు రాజ్యాన్ని స్వాధీనం చేసుకోకుండా,రాముడి పాదుకలను శిరస్సుపై ధరించి వాటినే సింహాసనంపై ఉంచి రాజ్యపాలన సాగించాడు.ఇది అధికారంపై ఆశ కంటే ధర్మం,విధేయత,విలువలకు ఇచ్చిన ప్రాధాన్యతను తెలియజేస్తుంది.కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీకి డబ్బులు మూసుకెళ్తారని“, “బిజెపి పార్టీ నేతలు ఆ పార్టీ అగ్ర నాయకుల చెప్పులు మోస్తారు“ అని పదేపదే బీఆర్ఎస్ పార్టీ నేతలు వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, చెప్పులు, పాదరక్షలను చులకనగా చూస్తూ అదే పనిగా విమర్శిస్తున్న నేతలు వాటి ప్రాముఖ్యతని తెలుసుకొని మాట్లాడాలి సూచించారు.అలాగే జమదగ్ని మహర్షి భార్య రేణుకలు ఎండల వేడికి అల్లాడుతూ ఉంటే సూర్య భగవానుడు ఆ దంపతులు ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు గొడుగు,పాదరక్షలను ప్రసాదించినట్లు పురాణ గాథలు చెబుతాయి.ఇందులో ఇతరుల పట్ల శ్రద్ధ,బాధ్యత,రక్షణ భావం స్పష్టంగా కనిపిస్తాయి.ఈ ఆదర్శాలు మనకు చెప్పేది ఒక్కటే.. రాజకీయాల్లో పదవులు,విమర్శల కంటే విలువలు,సంస్కారం,బాధ్యత,ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వాలి.తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు గతం నుంచి పదేపదే వ్యక్తిగత విమర్శలతో పాటు సన్నాసులు అడ్డ గాడిదలు అంటూ ఊత పదాలను ఉచ్చరించడం సమంజసం కాదని అదే ఆనవాయితీ నేడు తన అల్లుడు,తన కొడుకు అలవరిస్తున్నారని రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలు సరికావని ప్రజల సమస్యల పైన మాట్లాడాలి తప్ప,వ్యక్తిగత విమర్శలకు రాజకీయాల్లో తాగు లేదని ప్రజలు కూడా వాటిని హర్షిస్తారని ఈ సందర్భంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో నేతలు ఆన్మారి వెంకటయ్య,శ్రీనివాస్ యాదవ్,రవి తదితరులు పాల్గొన్నారు

# బీసీ సంఘాలకు ఆత్మగౌరవ భవనాలకు భారీగా నిధులు



వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల కోసం ‘ఆత్మగౌరవ భవనాల‘ నిర్మాణానికి రూ. 88.50 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) పత్రాలను అందజేశారు. అన్ని కులాల సామాజిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి లక్ష్యంగా ఈ భవనాల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. గతంలో భూములు కేటాయించినప్పటికీ, కొన్ని పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సహకారంతో ఇప్పుడు ఆ అడ్డంకులన్నీ తొలగిపోయాయని చెప్పారు. స్థలాలను ‘రెడీ-టు-కన్‌స్ట్రక్ట్‘ పద్ధతిలో లేఅవుట్లతో అభివృద్ధి చేశామని, ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసినందున కుల సంఘాలు తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.సంవత్సరంలోగా ఈ భవనాల నిర్మాణాలు పూర్తి చేసి బీసీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణాలకు అవసరమైన అన్ని అనుమతులను ఇంజనీరింగ్ విభాగం, హెచ్ఎండీఏ సమన్వయంతో ‘సింగిల్ విండో‘ విధానంలో జాప్యం లేకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణాల పురోగతిపై బీసీ సంక్షేమ శాఖ ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తుందని తెలిపారు.

# శంషాబాద్ మండల అభివృద్ధికి రూ.2.75 కోట్ల నిధులు

## గ్రామాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు,సీసీ రోడ్లు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన





**శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 5,**
గ్రామాలు, తండాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండల పరిధిలోని పాలమకుల, మేకల బండ తండా, పిల్లోనిగూడ, మదనపల్లి పాత తండాలలో హెచ్ఎండీఏ నిధులు సుమారు రూ. 2.75 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.ఇందులో భాగంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను చేపట్టనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామాలు తండాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రజల రోజువారీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణంతో పారిశుద్ధ్య సమస్యలు తగ్గడంతో పాటు, సీసీ రోడ్ల నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం స్థానిక ప్రజలకు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, తండాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రారెడ్డి,నీరటి రాజు, శంషాబాద్ మండల్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కే. కోటేశ్వర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, దండు ఇస్తారి, శ్రీకాంత్ గౌడ్, మోహన్ నాయక్, రవి నాయక్, ప్రభాకర్ గౌడ్, మల్చలం లక్ష్మీ లింగం,స్వర్ణలత నరసింహ, ప్రభాకర్ యాదవ్,రమేష్ పటేల్ స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, తండావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూ రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

## అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
భూ భారతి కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం మనోరాబాద్ గ్రామంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి అధ్యక్షతన భూ రీసర్వే గ్రామసభ అదేవిదంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భూ రికార్డులను ఆధునికీకరించడం,భూముల కొలతల్లో ఖచ్చితత్వాన్ని పెంపొందించడం, భూ సరిహద్దు వివాదాలను పరిష్కరించడం, భూ యజమానుల హక్కులను స్పష్టంగా నిర్ధారించడం భూ రీసర్వే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆధునిక డీజీపీస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూములను అత్యంత ఖచ్చితత్వంతో సర్వే చేసి, డిజిటల్ భూ రికార్డులను రూపొందించడం జరుగుతుందని వివరించారు. రీసర్వే ద్వారా భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించడం వల్ల రైతుల మధ్య భూ వివాదాలు తగ్గుతాయని, భూముల విస్తీర్ణాన్ని కచ్చితంగా నిర్ధారించడంతో పాటు పాత భూ రికార్డులను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావచ్చని పేర్కొన్నారు.అలాగే భూ యాజమాన్య హక్కుల స్పష్టత, ప్రభుత్వ అలాగే ప్రైవేటు భూముల ఆక్రమణల గుర్తింపు, భూముల సబ్‌డివిజన్ వివరాల నమోదు వంటి ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ఖచ్చితమైన భూ రికార్డులు అందుబాటులో ఉండటం వల్ల రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంతో పాటు బ్యాంకు రుణాలు పొందేందుకు సైతం సౌలభ్యం కలుగుతుందని వివరించారు. రీసర్వే పూర్తయిన అనంతరం నిబంధనల ప్రకారం కొత్త భూ రికార్డులు,పట్టా వివరాలను డిజిటల్ విధానంలో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు.
ఈ సందర్భంగా అధికారులు మనోరాబాద్ గ్రామ భూ వివరాలను గ్రామసభలో వెల్లడించారు. గ్రామ మొత్తం భౌగోళిక విస్తీర్ణం 288 ఎకరాల 07 గుంటలు కాగా, మొత్తం 48 సర్వే నంబర్లు ఉన్నాయి. ఇందులో పట్టా భూమి 267 ఎకరాల16 గుంటలు, ప్రభుత్వ భూమి 18ఎకరాల 35 గుంటలుగా వివరించారు. ప్రభుత్వ భూముల్లో ఎండోమెంట్ భూమి 3 ఎకరాలు, ప్రభుత్వ భూమి 10 ఎకరాల 05 గుంటలు, లావణ్య పట్టా భూమి 5 ఎకరాల 30 గుంటలుగా గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా రీసర్వే చేయవలసిన సబ్‌డివిజన్ నంబర్లు 388 ఉన్నట్లు వెల్లడించారు.
భూ రీసర్వే ప్రక్రియలో రైతులందరూ చురుకుగా భాగస్వాములై అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. రైతులు తమ భూములకు సంబంధించిన పాత రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్‌లు, ఇతర సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, సర్వే సమయంలో తమ భూముల సరిహద్దులు, విస్తీర్ణం,ఇతర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవాలని కోరారు. పారదర్శకమైన, ఖచ్చితమైన డిజిటల్ భూ రికార్డుల వ్యవస్థ ఏర్పాటుకు భూ రీసర్వే ఎంతో దోహదపడుతుందని,దీనివల్ల భూ యజమానులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎ డి.ఎస్ఎల్ఆర్ ఎం.రామ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఒ శ్రీనివాస్ రెడ్డి,మంచాల్ ఎమ్మార్వో వి.ప్రసాద్ రావు, ఇబ్రహీంపట్నం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే డి.శ్రీనివాస్, మండల సర్వేయర్ శ్రీమతి ఎస్ వి.ధనశ్రీ, మంచాల్ మండల లైసెన్స్ సర్వేయర్లు, గ్రామ పాలన అధికారి ఎన్. జంగయ్య, సర్పంచ్ ఎ. సంజీవ రెడ్డి, మంచాల్ మండల సిబ్బంది గ్రామ రైతులు హాజరయ్యారు.

# విద్యుత్ సరఫరాపై తప్పుడు ప్రచారం సరికాదు

## :డీఈ శ్యామ్ సుందర్ రెడ్డి





**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ ప్రాంతంలో విద్యుత్ వ్యవస్థను మరింత పటిష్టం చేసి రైతులకు, ప్రజలకు నిరంతరాయంగా మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సహకారం, చొరవతో నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ శ్యామ్ సుందర్ రెడ్డి వెల్లడించారు. గురువారం విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అభివృద్ధి పనులు, రైతులకు అందిస్తున్న సేవలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. గత రెండేళ్లలో సుమారు రూ. 33 కోట్ల వ్యయంతో 1,100 మంది రైతులకు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు అందించినట్లు తెలిపారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా 15 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల పునుపూర్ తదితర ప్రాంతాల్లో రైతుల పంటలు ఎండిపోకుండా అత్యవసర పరిస్థితుల్లో స్పందించి కేవలం ఒక్క రోజులోనే రెండు కిలోమీటర్ల మేర కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంతో పాటు పది ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. షాద్‌నగర్ ప్రాంతం జాతీయ రహదారి అనుసంధానంతో పాటు పారిశ్రామికంగా, ఉపగ్రహ పట్టణంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏడు కొత్త విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు.
మారుతున్న వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలాల కొరతను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి వినియోగం ఉండే సంప్రదాయ పంటలతో పాటు తక్కువ నీటితో అధిక ఆదాయం పొందే కూరగాయలు, పండ్ల సాగుపై దృష్టి సారించాలని డీఈ సూచించారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న నెట్‌హౌస్ విధానం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. నెట్‌హౌస్‌లో ఉష్ణోగ్రతలు సుమారు ఐదు డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని, సాధారణ సాగుతో పోలిస్తే నీటి వినియోగం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. పురుగుల బెడద తగ్గడం వల్ల పురుగుమందుల ఖర్చు కూడా ఆదా అవుతుందని, తక్కువ పెట్టుబడితో ఆరు నెలల వ్యవధిలో మంచి ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు చించోడ్ విద్యుత్ ఉపకేంద్రం వద్ద నమూనా నెట్‌హౌస్ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు, త్వరలోనే రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, షాద్‌నగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా మెరుగ్గా ఉన్నప్పటికీ కొందరు ఉద్దేశపూర్వకంగా విద్యుత్ శాఖపై అప్రతిష్ఠ కలిగించేలా ప్రచారం చేస్తున్నారని డీఈ శ్యామ్ సుందర్ రెడ్డి సమీక్ష సమావేశంలో పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా విద్యుత్ సరఫరాపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. రైతులు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# ఫరూక్‌నగర్ మండలంలో వ్యవసాయ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

## ఎల్ నినో ప్రభావంతో రైతులు పంటల పరిశీలన.





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**ఎల్ నినో ప్రభావం వల్ల మండలంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల పరిస్థితిని సమీక్షించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు గురువారం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గంలోని ఫరూక్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల, ఉప్పరిగడ్డ,వెల్జర్ల గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ నేతృత్వంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాంబాబు,గోవర్ధన్, ప్రణీతలు పొలాలను నేరుగా పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు రైతుల పొలాల్లోని పంటల స్థితిగతులను,నీటి ఎద్దడి వల్ల కలిగిన నష్టాన్ని, తెగుళ్ల తాకిడిని క్షుణ్ణంగా పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు లభ్యతగా ఉన్న నీటిని బిందు,తుంపర సేద్య పద్ధతుల ద్వారా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.నీటి ఎద్దడి సమయంలో పంట తట్టుకునే శక్తిని పెంపొందించేందుకు పొటాష్ ఎరువులు అలాగే సూక్ష్మ పోషకాల స్ప్రేలను తగిన మోతాదులో వాడాలని తెలిపారు.ఎల్ నినో ప్రభావంతో దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి, నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా తగిన న్యాయం జరిగేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు.

# ఫరూఖ్ నగర్ మండలంలోని పలు గ్రామాలలో ఎండిన పంటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్,పార్టీ శ్రేణులు

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**





పల్లెల్లో కరువు తాండవిస్తున్న సర్కారు నుంచి కనీస స్పందన లేదని,ఎండిన పంటలను చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం నియోజకవర్గంలోని ఫరూఖ్ నగర్ మండలం కడియాల కుంట తండా తోపాటు పలు గ్రామాలలో ఎండిన పంటలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. చరిత్రలో ఎన్నడు లేని విధంగా సెప్టెంబర్ అక్టోబర్ నెలలోనే రైతులు వేసిన పంటలు ఎండిపోయాయని,ఇలాంటి దురదృష్టకర వాతావరణం రావడం అత్యంత బాధాకరమని వాపోయారు. ఎలినో పరిస్థితుల వల్ల వర్షాలు పడవు అనే వాతావరణ శాఖ హెచ్చరించిన, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని తీవ్రస్థాయిలో ఆరోపించారు. వర్షాకాల ప్రారంభ సమయంలో గోదావరి కృష్ణా నదుల్లో వరద నీరుపారిన వాటిని ఎత్తిపోసుకోవడంలో ప్రభుత్వ దృష్టి సాధించలేదని, కేవలం రాజకీయాలకే ప్రాముఖ్యతను ఇచ్చిందని ఆరోపించారు. ముఖ్యంగా పాలమూరు వంటి జిల్లాలో కరువు అనేది సర్వసాధారణమైనది అనే నానుడి ఉందని, అయినప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకుండా రైతులను మరింత కష్టాలలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి పంటలు ప్రారంభమవుతున్నప్పటికీ నేటికీ రైతు భరోసా పై ప్రభుత్వానికి స్పష్టత లేదని, రైతులను ఏ విధంగా ఆదుకుంటారో చెప్పే పరిస్థితిలో ప్రభుత్వం లేదని వాపోయారు. గ్రామాలలో సాగుకు కరెంటు లేదు,సాగునీలు లేవు,సర్కారు మద్దతు లేదనీ, సరిపడా విద్యుత్ ఇస్తున్నామని చెప్పు ప్రభుత్వం ఎండిన పంటలకు ఎలాంటి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కరువు నేపథ్యంలో రానున్న యాసంగి పంటకైనా రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా 100% రాయితీతో విత్తనాలు,50% రాయితీతో ఎరువులను అందజేయాలని డిమాండ్ చేశారు.ఉన్న నీళ్లతోనైనా బిందు సేద్యంను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. వానకాలంలో పండిన పంటకు ఎలాంటి షరతులు విధించకుండా మద్దతు ధరను చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ మౌనిక హరి, సర్పంచులు లక్ష్మణ్ నాయక్, రాజు నాయక్, మాజీ సర్పంచులు రంగయ్య గౌడ్, రాములు, రవీందర్ నాయక్,సాయి ప్రసాద్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు బిశ్వ రామకృష్ణ, పోచయ్య, నాయకులు రాయికల్ వెంకట్ రెడ్డి,ప్రభాకర్, ఎల్లయ్య,రెడ్యా నాయక్,చట్టపట్ రవీందర్, నందిగామ శ్రీనివాస్, సంతోష్ గౌడ్,సురేష్, చందు లాల్, జంగయ్య యాదవ్, రాజేందర్, అద్నాన్,శేఖర్, పవన్,నర్సింలు, అంజయ్య, చంద్రకాంత్, మల్లేష్ నాయక్, దీప్లా నాయక్, గోవిందు నాయక్, గోవిందు రెడ్డి, వెంకటేష్ యాదవ్,గుండు అశోక్, రాఘవేందర్ గౌడ్,నవీన్, విజయ్,సిద్దు యాదవ్,నార్ల శ్రీనివాస్,సంజు నాయక్,శ్రీకాంత్, పవన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభాత్ నగర్ పార్కును కాపాడుకుంటాం.

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 5:30 గంటలకు చైతన్యపురి డివిజన్ పరిధిలోని ప్రభాత్ నగర్ పార్కును ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా పార్కులో వాకింగ్ చేస్తున్న వాకర్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వాకర్స్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ప్రభాత్ నగర్ పార్కులో ప్రతిరోజూ వాకింగ్ చేస్తున్నామని,వందలాది మంది స్థానికులు ఈ పార్కుపైనే ఆధారపడి ఉన్నారని తెలిపారు.అయితే పక్కనే నిర్మాణంలో ఉన్న టీమ్స్ హాస్పిటల్ యాజమాన్యం పార్కు వద్ద గేటు ఏర్పాటు చేయనున్నట్లు తెలియడంతో ఆందోళన వ్యక్తం చేశారు.గేటు ఏర్పాటు చేస్తే పార్కులో వాకింగ్ చేయడానికి సరిపడా స్థలం లేకుండా పోతుందని,ఇప్పటికే వినియోగంలో ఉన్న పార్కును రెండు భాగాలుగా విభజించడం సమంజసం కాదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్పందిస్తూ గతంలో ఇట్టి టీమ్స్ హాస్పిటల్ శంకుస్థాపన కార్యక్రమంలో గౌరవ అప్పటి ముఖ్యమంత్రివర్యులు కెసిఆర్ ని కలిసి ఇటు టీమ్స్ హాస్పిటల్ నందు పోలీస్ స్టేషన్,చిల్డ్రన్స్ పార్క్,వాటర్ ట్యాంక్,సబ్ స్టేషన్,తదితర కోసం స్థలం కేటాయించాలని కోరగా వారు వెంటనే స్పందించి దానికి సంబంధించిన జీ.వో.ఇవ్వడం జరిగింది.కానీ ప్రభుత్వం మారిపోయాక అట్టి జీ.ఓ.ను పక్కనపెట్టడం జరిగింది అని అన్నారు.ఏది ఏమైనా ఇట్టి పార్కు స్థలాన్ని వాకర్స్‌కు అందుబాటులో ఉంచేలా సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి గేటు ఏర్పాటు చేయకుండా అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే హామీపై వాకర్స్ హర్షం వ్యక్తం చేస్తూ సంతోషం తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి,తోట మహేష్ యాదవ్,చంద్రశేఖర్ రెడ్డి,త్రివేది,పవన్,జయశ్రీ,గట్టు శీను,రమణారెడ్డి,కాలనీ అధ్యక్షులు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ముసుగులో గులాబీ నేతల అబద్ధాల ప్రచారం

## క్షేత్రస్థాయిలో సాగునీరు, విద్యుత్‌కు కొరతే లేదు





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
పదవి పోయిందన్న ఆక్రోశంతో గులాబీ కండువాలు కప్పుకొని రైతుల ముసుగులో నిరసనల పేరిట రాద్ధాంతం చేస్తున్నారని హరీష్ రావు, కేటీఆర్‌లు గడ్డాలు,దుస్తులు కాదు..ఆలోచనా విధానం మార్చుకోవాలనీ షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఎద్దేవా చేశారు.ఫరూక్ నగర్ మండలం చించోడు గ్రామంలో పంటలు పరిశీలన అనంతరం స్థానిక మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు.
గత పదేళ్ల పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని విచ్చలవిడిగా స్కామ్‌లు చేసి, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి ప్రజలను పిప్పి చేశారని ఆరోపించారు.
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ సంక్షేమ పాలనందిస్తుంటే, ఓర్వలేక ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.చించోడు గ్రామంలో వెంకట్ రెడ్డి అనే రైతు ఎనిమిది ఎకరాలలో వరి పంటను వేయగ రైతుతో కలిసి పంటను పరిశీలించారు.

**క్షేత్రస్థాయిలో సంతృప్తికరంగా రైతులు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు రుణాలు మాఫీ చేయడంతో పాటు, రైతుబంధు,సబ్సిడీలు అలాగే సాగుకు అవసరమైనంత ఉచిత విద్యుత్తును నిరంతరాయంగా అందిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు తానే స్వయంగా కిషన్ నగర్, చౌలపల్లి,చించోడు తదితర గ్రామాల్లో పర్యటించినట్లు వెల్లడించారు.
చించోడు గ్రామానికి చెందిన వెంకటరెడ్డి అనే రైతు 8 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని,
పొలాలకు నీరు బాగానే అందుతోందని,విద్యుత్ సమస్యల్లేవని స్పష్టంగా చెప్పారనిగుర్తుచేశారు.ఎక్కడైనా సాంకేతిక సమస్యల వల్ల ఒక్క మడి ఎండిపోతే దాన్నే పెద్దది చేసి చూపుతూ ప్రతిపక్ష నాయకుడు హరీష్ రావు శవ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

**పిప్పి చేసి అప్పుల కుప్పగా మార్చారు.**


పదవి పోయిందన్న ఆక్రోశంతో గులాబీ కండువాలు కప్పుకొని రైతుల ముసుగులో నిరసనల పేరిట రాద్ధాంతం చేస్తున్నారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు.గత పదేళ్ల పాలనలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని విచ్చలవిడిగా స్కామ్‌లు చేసి,రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి ప్రజలను పిప్పి చేశారని ఆరోపించారు.వారి కుటుంబంలోనే దోచుకున్న సొమ్ముపై ఆరోపణలు బయటపడుతున్నాయని పేర్కొన్నారు.కేటీఆర్,హరీష్ రావు తమ మార్చుకోవాల్సింది గడ్డాలు, వేషధారణ కాదని... రైతులపై ఉన్న వారి వికృతమైన ఆలోచనా విధానాన్ని, బుద్ధిని మార్చుకోవాలని హితవు పలికారు.

**రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం**

తమ సొంత ఫామ్‌హౌస్‌లను మాత్రం పచ్చగా ఉంచుకుంటూ, బయట రైతుల పొలాలు ఎండిపోతున్నాయంటూ అబద్ధాల ప్రచారం చేయడం వారి నైజమని నిలదీశారు. తెలంగాణ ప్రజలు,రైతులు ప్రతిపక్షాల టక్కుటమార విద్యలను, మోసపూరిత మాటలను ఎంతమాత్రం నమ్మరని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రైతు బిడ్డ అని,రైతు కష్ట సుఖాలు ఆయనకు బాగా తెలుసని,రాష్ట్రంలో రైతు సంక్షేమ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

# స్టార్టప్ ఇంక్యుబేటర్లే భవిష్యత్తు!

## ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా.. ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత ఎదగాలి ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



**నవంబర్ 5(ప్రజావినికిడి)::**భారతదేశంలో ఉన్నత విద్య, ముఖ్యంగా మేనేజ్‌మెంట్ విద్యకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఐఐటీలు, ఐఐఎంలతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలు ఏటా వేలాది మంది పట్టభద్రులను తయారు చేస్తున్నాయి. అయితే వీరిలో ఎంతమంది కొత్త వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు? ఎంతమంది ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నారు? అనే ప్రశ్నలు కీలకంగా మారుతున్నాయి. చదువు పూర్తయిన తర్వాత మంచి ఉద్యోగం, అధిక వేతనం, ఉన్నత హోదా కోరుకోవడం సహజమే. కానీ యువత ఉద్యోగార్థులుగానే కాకుండా ఉద్యోగ కల్పనదారులుగా ఎదగాల్సిన అవసరం ఉంది.ప్రస్తుతం ఉద్యోగ రంగంలో పోటీ తీవ్రంగా పెరుగుతోంది. ఆటోమేషన్, కృత్రిమ మేధ వంటి సాంకేతిక మార్పులతో సంప్రదాయ ఉద్యోగాల స్వరూపం మారుతోంది. ఈ పరిస్థితుల్లో యువత కొత్త ఆలోచనలతో వ్యాపారాలను ప్రారంభించి ఉపాధి అవకాశాలను సృష్టించాలి. ఒక స్టార్టప్ విజయవంతమైతే వ్యవస్థాపకుడితో పాటు ఉద్యోగులు, సరఫరాదారులు, సాంకేతిక నిపుణులు, ఇతర సేవా సంస్థలకు కూడా ఉపాధి లభిస్తుంది. చిన్న ఆలోచన కూడా భవిష్యత్తులో పెద్ద పరిశ్రమగా ఎదిగే అవకాశం ఉంది.అయితే స్టార్టప్ ప్రారంభించడం అంత సులభం కాదు. పెట్టుబడులు, మార్కెట్ పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. కొన్ని సంస్థలు ప్రారంభ దశలోనే మూతపడుతున్నాయి. ఇలాంటి వైఫల్యాలను ఓటమిగా కాకుండా అనుభవాలుగా స్వీకరించే వాతావరణం ఏర్పడాలి. యువతకు సరైన మార్గదర్శకత్వం, ఆర్థిక సహకారం అందిస్తే మరిన్ని ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయి.**ఇంక్యుబేషన్ కేంద్రాలతో ప్రోత్సాహం**ప్రతి విశ్వవిద్యాలయంలో స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. విద్యార్థుల కొత్త ఆలోచనలను గుర్తించి వాటిని వ్యాపారాలుగా మార్చేందుకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహకారం అందించాలి. అనుభవజ్ఞులైన పారిశ్రామికవేత్తలను మార్గదర్శకులుగా నియమించాలి. బ్యాంకులు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు, ఏంజెల్ ఇన్వెస్టర్లతో విద్యార్థులకు అనుసంధానం కల్పించాలి. కేవలం కార్యాలయాలు, ఇంటర్నెట్ సదుపాయాలకే పరిమితం కాకుండా ఆలోచన నుంచి ఉత్పత్తి తయారీ, మార్కెట్ ప్రవేశం వరకు పూర్తి సహకారం అందించాలి.**గ్రామీణ ప్రాంతాలకూ స్టార్టప్ అవకాశాలు**స్టార్టప్ సంస్కృతి హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి నగరాలకే పరిమితం కాకూడదు. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లోని యువతకు కూడా అవకాశాలు కల్పించాలి. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ పరిశ్రమలు వంటి రంగాల్లో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలి. స్థానిక సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు చూపించే సంస్థలకు పెట్టుబడులు, శిక్షణ అందించాలి. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పెరగడంతో పాటు నగరాలకు వలసలు కూడా తగ్గుతాయి. **తెలంగాణలో విస్తృత అవకాశాలు**స్టార్టప్ రంగంలో తెలంగాణకు ప్రత్యేక అవకాశాలున్నాయి. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, పరిశోధన రంగాలకు కేంద్రంగా ఎదిగింది. టీ-హబ్ వంటి సంస్థలు కొత్త వ్యాపారాలకు ప్రోత్సాహం అందిస్తున్నాయి. ఈ అవకాశాలను రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా విస్తరించాలి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి స్థానిక యువతను ప్రోత్సహించాలి. విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెంచాలి.మొత్తంగా దేశ ఆర్థికాభివృద్ధిలో స్టార్టప్‌ల పాత్ర కీలకంగా మారుతోంది. యువతలోని ప్రతిభను గుర్తించి సరైన పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, మార్గదర్శకత్వం అందించాలి. విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా కొత్త వ్యాపారాలను స్థాపించి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా విద్యావ్యవస్థలో మార్పులు రావాలి. ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ కేంద్రాలు, ప్రతి జిల్లాలో స్టార్టప్‌లకు ప్రోత్సాహక వేదికలు ఏర్పాటైతే యువత ఆలోచనలకు రెక్కలు వస్తాయి. దేశ భవిష్యత్తు అభివృద్ధికి స్టార్టప్ ఇంక్యుబేటర్లే కీలక బాటలు వేయగలవు.

# గంటల వ్యవధిలో రెండు ప్రమాదాలు.. తృటిలో బయటపడ్డ ఎమ్మెల్యే వీరేశం

నవంబర్ 5:(ప్రజావినికిడి):
తెలంగాణ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఒకే రోజు గంటల వ్యవధిలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల నుంచి తృటిలో సురక్షితంగా బయటపడ్డారు. నల్గొండ జిల్లాలో గురువారం ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో ఆయన ప్రయాణిస్తున్న రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ఆయనకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అనుచరులు ఊపిరి పీల్చుకున్నారు.వివరాల్లోకి వెళితే.. ఎమ్మెల్యే వీరేశం గురువారం నకిరేకల్ నుంచి చిట్యాల మండలం చినకాపర్తికి తన ఫార్చ్యూనర్ వాహనంలో బయలుదేరారు. కట్టంగూరు మండలం చెర్వు అన్నారం స్టేజీ వద్ద జాతీయ రహదారిపై వెళుతుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక కార్నివాల్ కారు ఆయన వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ తాకిడికి ఎమ్మెల్యే కారు ముందు వెళుతున్న ఎస్కార్ట్ వాహనాన్ని ఢీకొంది. ప్రమాద తీవ్రతకు కారు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ఎయిర్‌బ్యాగ్‌లు వెంటనే తెరుచుకోవడంతో వీరేశం సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన జరిగిన వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమై, ఎమ్మెల్యేను మరో ఇన్నోవా క్రిస్టా కారులోకి మార్చి గమ్యస్థానానికి పంపించారు. అయితే, కొద్దిసేపటికే ఆ ప్రత్యామ్నాయ వాహనం కూడా ప్రమాదానికి గురైంది. చిట్యాల నుంచి తుంగతుర్తి వైపు వెళుతుండగా, ఒక లారీ వీరి కారును ఢీకొట్టింది. అదృష్టవశాత్తూ, ఈ రెండో ప్రమాదం నుంచి కూడా వీరేశం ఎలాంటి అపాయం లేకుండా బయటపడ్డారు.వరుస ప్రమాదాల తర్వాత కూడా ఎమ్మెల్యే వీరేశం తన పర్యటనను కొనసాగిస్తూ జనగామకు వెళ్లారు. ఒకే రోజు రెండుసార్లు ప్రమాద గండం నుంచి తమ నేత క్షేమంగా బయటపడటంతో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఓటరు జాబితాల సవరణపై కాంగ్రెస్ - బీజేపీ సమరం!

**ఎస్ఐఆర్ చుట్టూ ముదురుతున్న రాజకీయ వివాదం.. ఓటు హక్కుకు ముప్పు అంటున్న విపక్షాలు.. అక్రమ ఓట్ల తొలగింపునకు అడ్డుకట్ట వేయాలంటున్న బీజేపీ.. ఎన్నికల సంఘం పారదర్శకతపై దేశవ్యాప్తంగా చర్చ**



**నవంబర్ 5 (ప్రజావినికిడి):**

భారత ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది. ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఈ హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. అలాంటి ఓటు హక్కుకు సంబంధించిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారాన్ని రేపుతోంది. ఓటరు జాబితాలను ప్రక్షాళన చేయడం ద్వారా నకిలీ, మరణించిన, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లను తొలగించాలన్నది ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రక్రియ ఉద్దేశం. అయితే ఈ ప్రక్రియ అమలులో పారదర్శకత లోపిస్తోందని, అర్హులైన ఓటర్ల పేర్లు కూడా తొలగిపోయే ప్రమాదం ఉందని కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు ఓటరు జాబితాల ప్రక్షాళనను వ్యతిరేకించడం ద్వారా అక్రమ ఓట్లకు విపక్షాలు మద్దతు ఇస్తున్నాయని బీజేపీ విమర్శిస్తోంది. దీంతో ఓటరు జాబితాల సవరణ అంశం పరిపాలనా ప్రక్రియ నుంచి రాజకీయ పార్టీల మధ్య ప్రధాన పోరాటంగా మారింది.**ఓటరు జాబితాల సవరణపై రాజకీయ రగడ.. కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ** ఎస్ఐఆర్‌పై ఆరోపణలు, ప్రత్యారోపణలు.. ఢిల్లీలో కాంగ్రెస్ కూటమి, హైదరాబాద్‌లో బీజేపీ బలప్రదర్శన.. ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయతపై ప్రశ్నలు.. ప్రసంగాలు కాదు, ఆచరణలోనే నిజాయితీ నిరూపించుకోవాలంటున్న ప్రజలుభారత ప్రజాస్వామ్యంలో ఎన్నికలు, ఓటు హక్కు అత్యంత కీలకమైన అంశాలు. ప్రజలు తమ పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. అలాంటి ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఇప్పుడు దేశ రాజకీయాల్లో పెను వివాదానికి కేంద్రబిందువుగా మారింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఓటరు జాబితాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తుండగా, బీజేపీ మాత్రం అక్రమ ఓట్లు, నకిలీ ఓటర్లను తొలగించడాన్ని వ్యతిరేకించడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని విమర్శిస్తోంది. ఈ వివాదం నేపథ్యంలో నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు, నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ భారీ ర్యాలీలు నిర్వహించాయి. అయితే ఈ ప్రదర్శనల వల్ల ప్రజలకు కొత్తగా తెలిసిన విషయాలేమిటి? సమస్య పరిష్కారానికి రాజకీయ పార్టీలు చూపిస్తున్న చిత్తశుద్ధి ఎంత? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.**ర్యాలీలతో సమస్యకు పరిష్కారం లభిస్తుందా?** ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉంటుంది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ప్రతిపక్షాల బాధ్యత. అదే సమయంలో అధికారంలో ఉన్న పార్టీలు విమర్శలకు సమాధానం చెప్పాలి. కానీ ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం, భారీ ర్యాలీలు నిర్వహించడం, ప్రత్యర్థులను దూషించడం వల్ల సమస్యకు పరిష్కారం లభించదు. ఢిల్లీలో 'ఓట్ చోర్ గద్దీ ఛోడ్' నినాదంతో కాంగ్రెస్ కూటమి నిరసన తెలపగా, హైదరాబాద్‌లో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకత్వాన్ని తరిమికొట్టండి' అంటూ బీజేపీ సభ నిర్వహించింది. రెండు పార్టీలూ తమ వాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించాయి. అయితే ర్యాలీల వల్ల నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు, ప్రజలకు అసౌకర్యం తప్ప అసలు సమస్యపై స్పష్టత ఎంతవరకు వచ్చిందన్నది ఆలోచించాల్సిన విషయం. ప్రజలకు కావాల్సింది రాజకీయ నాయకుల ప్రసంగాలు కాదు.. తమ ఓటు హక్కుకు భరోసా.**13 కోట్ల ఓట్ల తొలగింపు.. నిజానిజాలు తేలాలి** దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో సుమారు 13 కోట్ల ఓట్లు తొలగించారన్నది విపక్షాల ప్రధాన ఆరోపణ. అయితే తొలగించిన ఓట్లన్నీ అర్హులైన భారత పౌరులవే అని భావించడం సరికాదు. మరణించిన వ్యక్తులు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్నవారు, అర్హత లేని వ్యక్తుల పేర్లు కూడా ఓటరు జాబితాల్లో ఉండే అవకాశం ఉంది. అలాంటి పేర్లను తొలగించడం ఎన్నికల ప్రక్రియలో అవసరమైన చర్యే. అయితే ఆ పేర్ల తొలగింపు పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును కూడా తొలగిస్తే అది తీవ్రమైన తప్పిదం అవుతుంది. ముఖ్యంగా చిన్నచిన్న సాంకేతిక కారణాలు చూపి, సరైన విచారణ లేకుండా ఓటర్ల పేర్లు తొలగించారనే ఆరోపణలు వస్తున్నప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. తొలగించిన మొత్తం పేర్లలో ఎంతమంది అనర్హులు? ఎంతమంది అర్హులైన ఓటర్లు? ఏ కారణాలతో పేర్లు తొలగించారు? అనే వివరాలను ఎన్నికల సంఘం స్పష్టంగా వెల్లడించాలి. అప్పుడే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడుతుంది.**ఎన్నికల సంఘం బాధ్యత ఏమిటి?** ఎన్నికల నిర్వహణలో భారత ఎన్నికల సంఘం అత్యంత కీలకమైన రాజ్యాంగ సంస్థ. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగడం, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం దాని ప్రాథమిక బాధ్యత. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర విపక్షాలు నిర్దిష్టమైన ఆరోపణలు చేస్తున్నప్పుడు వాటికి ఎన్నికల సంఘమే స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతలు ఎన్నికల సంఘం తరఫున వాదనలు వినిపించడం కంటే, ఆ సంస్థ తనంతట తానుగా ప్రజలకు వివరణ ఇవ్వడం ముఖ్యం. రాజ్యాంగ సంస్థల స్వతంత్రతపై ప్రజలకు ఎలాంటి సందేహాలు రాకుండా వ్యవహరించాల్సిన బాధ్యత వాటిపై ఉంది. ఎన్నికల సంఘం నిర్ణయాలు నిష్పక్షపాతంగా ఉన్నాయని ప్రజలు నమ్మినప్పుడే ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం బలపడుతుంది. విమర్శలు వచ్చిన ప్రతిసారీ రాజకీయ నాయకులు ఎదురుదాడికి దిగడం కంటే, వాస్తవాలను వెల్లడించడం ద్వారా అనుమానాలను నివృత్తి చేయడం సముచితం

# పారిశ్రామిక వాడలో మొదటి ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమకు శ్రీకారం..!

**తిమ్మాపూర్‌లో "ఇడెన్ ఈవీ" ఫ్యాక్టరీ యూనిట్ ప్రారంభం**

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా శ్రీకారం..**

**ప్రాంతంలోనే తొలి ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమగా గుర్తింపు**

**కాలుష్య నివారణకు విద్యుత్ వాహనాల వినియోగం ఎంతో కీలకం**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**

పారిశ్రామిక అభివృద్ధికి చిరునామాగా ఎదుగుతున్న షాద్‌నగర్ నియోజకవర్గంలో మరో కొత్త పరిశ్రమకు శ్రీకారం చుట్టారు. కొత్తూర్ మండలం తిమ్మాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఈడెన్ ఈవీ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిశ్రమను గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. నియోజకవర్గంలోనే తొలి ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమ ఏర్పాటు కావడం సంతోషకరమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహానగరాల్లో వాహనాల కాలుష్యం తీవ్ర సమస్యగా మారిందని అన్నారు.పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాహనదారులు విద్యుత్ వాహనాల వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కాలుష్యరహిత రవాణా వ్యవస్థకు ఎలక్ట్రిక్ వాహనాలు దోహదపడతాయని తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతంలో ఇలాంటి పరిశ్రమ ఏర్పాటు కావడం స్థానికంగా పారిశ్రామిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, మరిన్ని పరిశ్రమలు ఈ ప్రాంతానికి రావాలని ఆకాంక్షించారు. తన చేతుల మీదుగా తొలి ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమను ప్రారంభించడం ఆనందంగా ఉందని పేర్కొంటూ యూనిట్ నిర్వాహకులు బి. రవికుమార్, వేమూరి ప్రతాప్, శ్రీనివాస్ రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పరిశ్రమ నిర్వాహకుల్లో ఒకరైన రవికుమార్ మాట్లాడుతూ, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. భవిష్యత్తులో రవాణా రంగంలో విద్యుత్ వాహనాల వినియోగం మరింత పెరుగుతుందని, పెట్రోల్,డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యుత్ వాహనాల వినియోగం ద్వారా ఇంధన ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చని తెలిపారు.తమ ఆహ్వానాన్ని మన్నించి పరిశ్రమను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి,మాజీ ఎమ్మెల్యే శివశంకర్ గౌడ్, సామాజికవేత్త కేకే కృష్ణ,మాజీ జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.









# ఎన్నికల విధుల్లో టీచర్ మృతి..

**చంద్రబాబు, నారా లోకేశ్ తీవ్ర విచారం**

**అనంతపురం జిల్లాలో ఎన్నికల విధుల్లో విషాదం**

**అస్వస్థతకు గురై పోలింగ్ అధికారిణి హరిత మృతి**

**కదిరదరకుంట పోలింగ్ కేంద్రంలో ఘటన**

**కుటుంబానికి అండగా ఉంటామని సీఎం చంద్రబాబు హామీ**

**ప్రగాఢ సానుభూతి తెలియజేసిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్**



**నవంబర్ 5:(ప్రజావినికిడి):**

ఆంధ్రప్రదేశ్‌లో నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అనంతపురం జిల్లాలో పోలింగ్ అధికారిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఓ ఉపాధ్యాయురాలు అకస్మాత్తుగా మరణించారు. ఈ ఘటన గురువారం కూడేరు మండలంలో జరిగింది.వివరాల్లోకి వెళితే, కూడేరు మండలం కాడదారకుంట గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా (ఏపీఓ) హరిత గౌడ్ (58) విధుల్లో ఉన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జరుగుతుండగా ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ పోలింగ్ కేంద్రంలోనే కుప్పకూలిపోయారు. వెంటనే అప్రమత్తమైన అక్కడి వైద్య సిబ్బంది ఆమెను కుడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. గుండెపోటు రావడంతో మధ్యాహ్నం సుమారు 12:50 గంటలకు ఆమె తుదిశ్వాస విడిచినట్లు అధికారులు తెలిపారు.మృతురాలు హరిత, డి.హిరేహళ్ మండలం పూలకుర్తి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా (ఎస్జీటీ) పనిచేస్తున్నారు. ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయురాలు మరణించడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హరిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంటలో ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న టీచర్ హరిత గౌడ్ గారు గుండెపోటుతో కన్నుమూయడం చాలా బాధాకరం. అస్వస్థతకు గురైన వెంటనే అత్యవసర వైద్యం అందించినా ఫలితం లేక మృతి చెందడం ఈ విషాదం నెలకొంది. వారికి నివాళులు అర్పిస్తున్నాను. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అంటూ సోషల్ మీడియాలో స్పందించారు.

# దేశవ్యాప్తంగా వందే భారత్ హవా..

## నిండిపోతున్న సీట్లు, స్లీపర్లకు ఫుల్ డిమాండ్

**నవంబర్ 5(ప్రజావినికిడి):**



దేశంలో ప్రవేశపెట్టిన సెమీ-హై-స్పీడ్ రైళ్లు వందే భారత్ సర్వీసులకు ప్రయాణికుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ రైళ్ల ఆక్యుపెన్సీ గణాంకాలు వాటి విజయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా, తిరువనంతపురం సెంట్రల్-మంగళూరు సెంట్రల్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఏకంగా 189.35% ఆక్యుపెన్సీతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి సరికొత్త రికార్డు సృష్టించింది.రైల్వే బోర్డు అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా నడుస్తున్న అన్ని వందే భారత్ చైర్ కార్ సర్వీసుల్లో కలిపి సగటు ఆక్యుపెన్సీ 99.10%గా నమోదైంది. జనవరి 2026లో ప్రారంభమైన తొలి వందే భారత్ స్లీపర్ రైలు (హౌరా-కామాఖ్య) కూడా ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ రైలులో ఏకంగా 114.54% ఆక్యుపెన్సీ నమోదైనట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తన కథనంలో పేర్కొంది.

# తిరుమల లడ్డూ కేసు విచారణ ఏపీలోనే..

**బదిలీ పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు**

**తిరుపతి లడ్డూ నెయ్యి కల్తీ కేసు విచారణపై సుప్రీం కీలక నిర్ణయం**

**కేసును ఏపీ నుంచి బదిలీ చేయాలన్న పిటిషన్ కొట్టివేత**

**ప్రస్తుత దశలో బదిలీ అవసరం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం**

**నవంబర్ 5:(ప్రజావినికిడి):**





తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసుకు సంబంధించిన విచారణను ఆంధ్రప్రదేశ్ వెలుపలకు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ కేసు విచారణను మరో రాష్ట్రానికి మార్చాలని నిందితుల్లో ఒకరు దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈరోజు కొట్టివేసింది. ప్రస్తుత దశలో కేసును బదిలీ చేయాల్సినంత బలమైన కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేసింది.
ఈ కేసులో నిందితుడిగా ఉన్న మహారాష్ట్రకు చెందిన వ్యాపారవేత్త, మాల్గంగా మిల్క్ అండ్ అగ్రో ప్రొడక్ట్స్ ఎండీ మచీంద్ర శాంతారాం లంకే ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఈ కేసుపై రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని, దీనివల్ల నిష్పక్షపాత విచారణకు ప్రతికూల వాతావరణం ఉందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే కోర్టుకు తెలిపారు.
దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్... "మా ఆదేశాలతో వారందరినీ మౌనంగా ఉండేలా చేశాం. ఏదైనా జరిగితే మీరు మా వద్దకు రావచ్చు" అని వ్యాఖ్యానించారు. తాము గతంలో ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా రాజకీయ నేతలు వ్యాఖ్యలు చేశారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కేసు బదిలీకి తగిన కారణాలు లేవని పేర్కొంటూ, పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. దీంతో ఈ కేసు విచారణ ఇకపై ఆంధ్రప్రదేశ్‌లోనే కొనసాగనుంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక





## పాక్‌పై భారత్ ఘన విజయం..

# చివర్లో ఉత్కంఠ!

### - సాఫ్ ఛాంపియన్‌షిప్ ఆరంభ మ్యాచ్‌లో 3-2తో గెలుపు

**ఢాకా:** దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య ఛాంపియన్‌షిప్-2026లో భారత ఫుట్‌బాల్ జట్టు అదరగొట్టింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన భారత ఆటగాళ్లు తొలి అర్ధభాగంలోనే మూడు గోల్స్ చేసి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు.మ్యాచ్ 13వ నిమిషంలో సుహైల్ అహ్మద్ భట్ తొలి గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత కేవలం ఆరు నిమిషాల వ్యవధిలోనే మరోసారి గోల్ సాధించి స్కోరును 2-0కు చేర్చాడు. 32వ నిమిషంలో మాంగ్లెంతాంగ్ కిప్‌గెన్ మూడో గోల్ చేయడంతో భారత్ 3-0 ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది.అయితే మ్యాచ్ చివరి నిమిషాల్లో పాకిస్థాన్ ఆటగాళ్లు పోరాట పటిమ చూపించారు. 90+1వ నిమిషంలో నజీబ్ గోల్ చేయగా, 90+4వ నిమిషంలో ఖాజీ మరో గోల్ సాధించాడు. దీంతో స్కోరు 3-2కు చేరి మ్యాచ్‌లో ఉత్కంఠ నెలకొంది. అయినప్పటికీ భారత ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి ఆధిక్యాన్ని కాపాడుకున్నారు. చివరకు 3-2తో విజయం సాధించి సాఫ్ ఛాంపియన్‌షిప్‌లో శుభారంభం చేశారు.

# కోహ్లీ బ్యాటింగ్‌కు ఫిదా..

# రవిశాస్త్రి ప్రశంసల వర్షం!

**గత 7-10 ఏళ్లలో ఆడిన అత్యుత్తమ ఇన్నింగ్స్‌ల్లో ఇదొకటి**

**పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కోహ్లీనే ఆల్‌టైమ్ గ్రేట్**

**ఇప్పటికీ టెస్టుల్లో రాణించే సత్తా ఉందని వ్యాఖ్య**



**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి తన బ్యాటింగ్‌తో అభిమానులను అలరించాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో అద్భుత ఆటతీరుతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా ఉన్న పిచ్‌పై కివీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని కేవలం 51 బంతుల్లోనే 74 పరుగులు సాధించాడు. కోహ్లీ ప్రదర్శనపై మాజీ భారత కోచ్ రవిశాస్త్రి ప్రశంసల వర్షం కురిపించాడు.**అద్భుతమైన ఇన్నింగ్స్..** న్యూజిలాండ్ పేసర్లకు సహకరించిన పిచ్‌పై కోహ్లీ చూపిన ఆత్మవిశ్వాసం, బ్యాటింగ్ నైపుణ్యం అద్భుతమని రవిశాస్త్రి కొనియాడాడు. గత ఏడెనిమిది, పదేళ్లలో కోహ్లీ ఆడిన అత్యుత్తమ ఇన్నింగ్స్‌ల్లో ఇదొకటని అభిప్రాయపడ్డాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి తప్పులు చేయకుండా, ఎంతో సులభంగా బ్యాటింగ్ చేయడం సాధారణ విషయం కాదని పేర్కొన్నాడు. ఇతర బ్యాటర్లకు కష్టంగా అనిపించిన పిచ్‌పై కోహ్లీ మాత్రం తనదైన శైలిలో పరుగులు సాధించాడని ప్రశంసించాడు.**పరిమిత ఓవర్లలో ఆల్‌టైమ్ గ్రేట్..** కోహ్లీ గణాంకాలు, సాధించిన పరుగులు, సెంచరీలు, లక్ష్య ఛేదనలో జట్టును విజయతీరాలకు చేర్చిన తీరు అతడి గొప్పతనానికి నిదర్శనమని శాస్త్రి పేర్కొన్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కోహ్లీని ఆల్‌టైమ్ అత్యుత్తమ ఆటగాడిగా అభివర్ణించాడు. క్రీజులో ఉన్నప్పుడు పరుగుల వేగాన్ని నియంత్రిస్తూ, అవసరమైన సమయంలో దూకుడు పెంచడం అతడి ప్రత్యేకత అని తెలిపాడు.**టెస్టుల్లోనూ ఆడగలడు..** విరాట్ కోహ్లీకి ఇప్పటికీ టెస్టు క్రికెట్‌లో రాణించే సామర్థ్యం ఉందని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. అతడి ఫిట్‌నెస్ స్థాయిలు అత్యుత్తమంగా ఉన్నాయని, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆటపై అంకితభావం చూస్తే టెస్టుల్లోనూ సత్తా చాటగలడని అభిప్రాయపడ్డాడు. కోహ్లీని మళ్లీ టెస్టు క్రికెట్‌లో చూడాలని పలువురు అంతర్జాతీయ ఆటగాళ్లు కోరుకుంటున్నారని పేర్కొన్నాడు.

# రికార్డుల రారాజు రొనాల్డో రిటైర్మెంట్!

**23 ఏళ్ల అంతర్జాతీయ ఫుట్‌బాల్ ప్రయాణానికి ముగింపు..**

**పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు, 146 గోల్స్**



ఫుట్‌బాల్ ప్రపంచాన్ని తన ఆటతీరుతో ఉర్రూతలూగించిన పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు. 23 ఏళ్లపాటు పోర్చుగల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆయన తన సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు ప్రకటించాడు. ఈ సందర్భంగా తన జాతీయ జట్టు ఏడో నంబర్ జెర్సీని భవిష్యత్తు తరానికి అందించాల్సిన సమయం వచ్చిందని సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించాడు.**రికార్డులే చిరునామాగా..** రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌లో ఎన్నో అరుదైన రికార్డులు సృష్టించాడు. పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ సాధించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా చరిత్రలో నిలిచాడు. ఐదుసార్లు ఫిఫా అత్యుత్తమ ఆటగాడిగా ఎంపికయ్యాడు. నాలుగు యూరోపియన్ గోల్డెన్ షూ పురస్కారాలను అందుకున్నాడు. కెరీర్‌లో 1,300కు పైగా మ్యాచ్‌లు ఆడిన ఘనత సాధించాడు.**పోర్చుగల్‌కు చిరస్మరణీయ విజయాలు..** 2016లో పోర్చుగల్ యూరో కప్ గెలవడంలో రొనాల్డో కీలక పాత్ర పోషించాడు. 2019, 2025లో నేషన్స్ లీగ్ టైటిళ్ల సాధించిన జట్టులోనూ భాగమయ్యాడు. ఆరు ప్రపంచకప్‌లలో ఆడిన అరుదైన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. ప్రపంచకప్ సాధించాలన్న కల నెరవేరకపోయినా, దేశం తరఫున ఆడినందుకు జీవితాంతం గర్వపడతానని తన వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు.**క్లబ్ ఫుట్‌బాల్‌లో కొనసాగింపు..** అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికినప్పటికీ రొనాల్డో ఫుట్‌బాల్‌కు పూర్తిగా దూరం కావడం లేదు. సౌదీ అరేబియా క్లబ్ అల్ నసర్ తరఫున కొనసాగనున్నాడు. పోర్చుగల్ జట్టుకు అందించిన సేవలు, సాధించిన రికార్డులు ఫుట్‌బాల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి.

# రెండో వన్డేలో నితీశ్‌కు చోటు అవసరం లేదు!

- **రహానే కీలక వ్యాఖ్యలు..**

**ఆకిబ్ నబీకి మరో అవకాశం ఇవ్వాలని సూచన**



**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమిండియా వరుస విజయాలపై దృష్టి సారించింది. తొలి వన్డేలో విజయం సాధించిన భారత జట్టు రెండో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో తుది జట్టు కూర్పుపై చర్చ మొదలైంది. ముఖ్యంగా తెలుగు యువ ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డికి రెండో వన్డేలోనైనా అవకాశం దక్కుతుందా? లేదా? అన్న ఆసక్తి నెలకొంది.ఈ అంశంపై మాజీ భారత క్రికెటర్ అజింక్య రహానే స్పందించాడు. ప్రస్తుత భారత జట్టు కూర్పును పరిశీలిస్తే నితీశ్ కుమార్ రెడ్డిని రెండో వన్డేలో ఆడించాల్సిన అవసరం కనిపించడం లేదని అభిప్రాయపడ్డాడు. నితీశ్ జట్టులో ఉన్నా, లేకపోయినా పెద్దగా తేడా ఉండదని పేర్కొన్నాడు. ప్రస్తుతం జట్టులో ఉన్న ఆటగాళ్లతోనే సమతూకమైన కూర్పు ఉందని రహానే వ్యాఖ్యానించినట్లు సమాచారం.**ఆకిబ్ నబీకి మరో అవకాశం ఇవ్వాలి..** తొలి వన్డేలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన యువ పేసర్ ఆకిబ్ నబీకి మాత్రం మరో అవకాశం ఇవ్వాలని రహానే సూచించాడు. తొలి మ్యాచ్‌లో నబీ ఆరు ఓవర్ల బౌలింగ్ చేసి 33 పరుగులు ఇచ్చినా వికెట్ సాధించలేకపోయాడు. అయినప్పటికీ అతడి ప్రతిభను నిరూపించుకునేందుకు మరో మ్యాచ్‌లో అవకాశం కల్పించాలని అభిప్రాయపడ్డాడు.యువ ఆటగాళ్లకు వరుసగా అవకాశాలు ఇవ్వడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని రహానే పేర్కొన్నాడు. ఒక మ్యాచ్‌లో వికెట్లు తీయలేదని వెంటనే పక్కన పెట్టకుండా, మరోసారి తమ సత్తా చాటుకునే అవకాశం ఇవ్వాలని సూచించాడు. ఈ విషయంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నిర్ణయం కీలకం కానుంది.**తొలి మ్యాచ్‌లో భారత్ విజయం..** ఐదు వన్డేల సిరీస్‌ను భారత్ విజయంతో ప్రారంభించింది. ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో న్యూజిలాండ్‌ను 185 పరుగులకే ఆలౌట్ చేసింది. వర్షం కారణంగా భారత్ లక్ష్యాన్ని 143 పరుగులకు కుదించగా, 22.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సమిష్టి ప్రదర్శనతో ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది.ఇప్పుడు వెల్లింగ్‌టన్ వేదికగా జరిగే రెండో వన్డేపై భారత జట్టు దృష్టి సారించింది. తొలి మ్యాచ్‌లో సాధించిన విజయోత్సాహంతో బరిలోకి దిగనున్న గిల్ సేన.. మరో గెలుపుతో సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. నితీశ్‌కు అవకాశం కల్పిస్తారా? ఆకిబ్ నబీని కొనసాగిస్తారా? అన్నది జట్టు ఎంపికలో ఆసక్తికరంగా మారింది.

## రంజీ ట్రోఫీలో త్రిపుర సంచలనం..

# సౌరాష్ట్రపై ఘన విజయం!

### - 133 పరుగుల తేడాతో గెలుపు..

**సీజన్‌లో తొలి విజయాన్ని నమోదు**



**అగర్తలా:** రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి మ్యాచ్‌లో త్రిపుర జట్టు సంచలనం సృష్టించింది. రెండుసార్లు రంజీ ట్రోఫీ విజేతగా నిలిచిన సౌరాష్ట్రను 133 పరుగుల తేడాతో ఓడించింది. గురువారం ముగిసిన ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో త్రిపుర ఈ సీజన్‌లో తొలి విజయాన్ని అందుకుంది.మొదట బ్యాటింగ్ చేసిన త్రిపుర తొలి ఇన్నింగ్స్‌లో 268 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన సౌరాష్ట్ర కేవలం 118 పరుగులకే కుప్పకూలింది. దీంతో త్రిపురకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో త్రిపుర 191 పరుగులు చేసి ఆలౌటైంది. దీంతో సౌరాష్ట్ర ముందు 342 పరుగుల లక్ష్యం నిలిచింది.భారీ లక్ష్య ఛేదనలో సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో 208 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్ అర్పిత్ వాసవడ 189 బంతుల్లో 89 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. అయితే మిగతా బ్యాటర్ల నుంచి సహకారం లభించకపోవడంతో జట్టు ఓటమి పాలైంది.**బౌలర్ల విజృంభణ..** త్రిపుర బౌలర్లు సందీప్ సర్కార్, అభిజిత్ సర్కార్ కీలక వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించారు. సందీప్ సర్కార్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఎనిమిది వికెట్లు సాధించగా, అభిజిత్ సర్కార్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో సందీప్ నాలుగు, అభిజిత్ మూడు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో నాలుగు మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లు సాధించిన త్రిపుర పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి చేరుకుంది.

# సీఎస్‌కే, ఎస్ఆర్‌హెచ్ మధ్య నలుగురు ఆటగాళ్ల మార్పిడి!

- **ఐపీఎల్-2027కు ముందే కీలక ట్రేడ్.. చెన్నైకి లివింగ్‌స్టోన్, జాక్ ఎడ్వర్డ్స్**
- **హైదరాబాద్ జట్టులోకి ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్**



**న్యూఢిల్లీ:** ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు కీలక మార్పులు చేపట్టాయి. రెండు ఫ్రాంచైజీలు నలుగురు ఆటగాళ్లను పరస్పరం మార్చుకుంటూ ట్రేడ్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ చెన్నై జట్టులోకి వెళ్లగా.. భారత పేసర్ ఖలీల్ అహ్మద్, ఆస్ట్రేలియా బౌలర్ నాథన్ ఎల్లిస్ హైదరాబాద్ జట్టులో చేరనున్నారు.**చెన్నైకి ఇద్దరు ఆల్‌రౌండర్లు..** లివింగ్‌స్టోన్ గతంలో హైదరాబాద్ జట్టు రూ.13 కోట్లకు కొనుగోలు చేయగా, తాజా ఒప్పందంలో రూ.6 కోట్లకే చెన్నైకి బదిలీ అయ్యాడు. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ రూ.3 కోట్ల పాత ధరతోనే సీఎస్‌కేలో చేరనున్నాడు. గాయంతో గత సీజన్‌లో ఎడ్వర్డ్స్ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. లివింగ్‌స్టోన్ కూడా రెండు మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు.**హైదరాబాద్‌కు పేసర్ల బలం..** భారత ఎడమచేతి వాటం పేసర్ ఖలీల్ అహ్మద్ రూ.4.8 కోట్ల ధరతో తిరిగి సన్‌రైజర్స్‌లోకి వస్తున్నాడు. గతంలో 2018 నుంచి 2021 వరకు హైదరాబాద్ తరఫున ఆడిన ఖలీల్.. ఐపీఎల్-2025లో చెన్నై తరఫున 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. గత సీజన్‌లో గాయంతో ఐదు మ్యాచ్‌లకే దూరమయ్యాడు. మరోవైపు ఆస్ట్రేలియా పేసర్ నాథన్ ఎల్లిస్ రూ.2 కోట్ల ధరతో ఎస్ఆర్‌హెచ్‌లో చేరనున్నాడు. డెత్ ఓవర్లలో వైవిధ్యమైన బౌలింగ్‌తో రాణించే ఎల్లిస్ రాకతో హైదరాబాద్ బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూరనుంది.**డిసెంబర్ 16న వేలం..** ఐపీఎల్-2027కు సంబంధించిన ఆటగాళ్ల మినీ వేలం డిసెంబర్ 16న గోవాలో జరగనుంది. ఆటగాళ్ల రిటెన్షన్, విడుదలకు నవంబర్ 17 వరకు గడువు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీలు తమ జట్లను బలోపేతం చేసుకునేందుకు ట్రేడ్‌లు, ఆటగాళ్ల మార్పిడిపై దృష్టి సారిస్తున్నాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఓటీటీలోకి 'జైలర్-2'.. నవంబర్ 12 నుంచి సందడి!



## ఐదు భాషల్లో స్ట్రీమింగ్.. రజనీకాంత్ అభిమానులకు శుభవార్త

**హైదరాబాద్:** సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులకు శుభవార్త. ఆయన నటించిన భారీ యాక్షన్ చిత్రం 'జైలర్-2' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో నవంబర్ 12 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. గురువారం ప్రైమ్ వీడియో సంస్థ అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించింది. తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. **భారీ తారాగణంతో..**నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి టైగర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో అలరించారు. మోహన్‌లాల్, హృతిక్ రోషన్, విజయ్ సేతుపతి ప్రత్యేక పాత్రల్లో కనిపించగా.. శివరాజ్‌కుమార్, ఎస్.జే. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. **రికార్డు స్థాయి వసూళ్లు..**థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం భారీ వసూళ్లు సాధించి తమిళ చిత్ర పరిశ్రమలో రికార్డులు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.820 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. దీంతో రజనీకాంత్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. థియేటర్లలో విజయవంతమైన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోనూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.

# చిన్ననాటి జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లే 'సమ్మర్ హాలిడేస్'..



విభిన్నమైన కథలతో విజయాలు అందుకుంటున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని తన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'సమ్మర్ హాలిడేస్'. శ్రీకర్ దర్శకత్వంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 6న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, హీరో కిరణ్ అబ్బవరం, దర్శకుడు బాబీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, "ఈ సినిమా చూస్తున్నప్పుడు పెద్దలు కూడా తమ బాల్యంలోకి వెళ్లిపోయి పిల్లల్లా మారి ఎంజాయ్ చేస్తారు. ఈతరం పిల్లలు చాలా టాలెంట్‌తో, కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. బిజీ లైఫ్‌లో మనం మర్చిపోయిన ఎన్నో జ్ఞాపకాలను, అమ్మమ్మ ఊరి అనుభూతులను ఈ సినిమా గుర్తు చేస్తుంది. ఇది చిన్న సినిమాగా అనిపించడం లేదు. నిర్మాత ధీరజ్ నమ్మకం నిజమై, ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి" అని ఆకాంక్షించారు.నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, "ధీరజ్ నాతో కలిసి పనిచేశాడు. గీతా ఆర్ట్స్ లాగే క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా ఈ సినిమాను తీర్చిదిద్దాడని విన్నాను. ఇలాంటి మంచి చిత్రాలను కిరణ్ అబ్బవరం లాంటి హీరోలు సపోర్ట్ చేయడం అభినందనీయం. ఇది అందరికీ మంచి నోస్టాల్జిక్ అనుభూతినిస్తుంది" అని అన్నారు.సహజనటి జయసుధ మాట్లాడుతూ, "ఇది పిల్లల సినిమా కాదు, ఇద్దరు చిన్న హీరోలు నటించిన సినిమా. వేసవి సెలవుల చుట్టూ అల్లుకున్న ఈ కథ అందరికీ కనెక్ట్ అవుతుంది. పెద్ద నిర్మాతలు కూడా ఇలాంటి చిన్న చిత్రాలను ప్రోత్సహించాలి" అని సూచించారు.నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ, "ఇది పిల్లలు నటించిన పెద్దల సినిమా. ఈ చిత్రం చూశాక ప్రతి ఒక్కరూ తమ చిన్ననాటి స్నేహితులకు ఫోన్ చేస్తారు. కుటుంబమంతా కలిసి చూసేలా, మన జ్ఞాపకాలను గుర్తుచేసేలా ఉంటుంది" అని తెలిపారు. దర్శకుడు బాబీ మాట్లాడుతూ, ఈ సినిమా వినోదంతో పాటు మంచి సందేశం ఇస్తుందని, పిల్లలతో సినిమా తీయడం అంత సులువు కాదని, దర్శకుడు శ్రీకర్‌ను అభినందించారు.దర్శకుడు శ్రీకర్ తన టీమ్‌కు, నటీనటులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ సినిమా కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజీవ్ కనకాల, వాసుకి, మాస్టర్ అరుణ్, మాస్టర్ రోహన్ తదితరులు పాల్గొని చిత్ర విజయంపై ధీమా వ్యక్తం చేశారు.

# కుటుంబ భావోద్వేగాలు.. మధురమైన సంగీతంతో 'మాయలేడి'!

## నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల.. రాకేష్ వర్రే, మధుమిత సర్కార్ జంటగా నటించిన చిత్రం

**హైదరాబాద్:** యంగ్ హీరో, నిర్మాత రాకేష్ వర్రే నటిస్తూ నిర్మిస్తున్న తాజా చిత్రం 'మాయలేడి' విడుదలకు సిద్ధమైంది. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రశంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. మధుమిత సర్కార్ కథానాయికగా నటిస్తోంది. ఈ నెల 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా హైదరాబాద్‌లో చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు.**ప్రేమలోని భావోద్వేగాలే కథాంశం..**దర్శకుడు ప్రశంకర్ మాట్లాడుతూ.. ప్రేమ సంబంధాల్లో ఎదురయ్యే అనేక భావోద్వేగాలను సినిమాలో చూపించామని తెలిపారు. క్రిష్ అనే యువకుడు తన ప్రేయసిలోని విభిన్నమైన భావాలను ఎలా ఎదుర్కొన్నాడన్నది ఆసక్తికరంగా తెరకెక్కించామని చెప్పారు. మంచి సంగీతం, వినోదంతో పాటు చిన్న సందేశం కూడా సినిమాలో ఉంటుందని వెల్లడించారు.

**కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా..**

హీరో, నిర్మాత రాకేష్ వర్రే మాట్లాడుతూ.. 'మన్మథుడు', 'నువ్వు నాకు నచ్చావ్', 'నిన్నే పెళ్లాడతా' వంటి చిత్రాల తరహాలో కుటుంబ అంశాలు, సంగీతానికి ప్రాధాన్యమిస్తూ 'మాయలేడి'ని రూపొందించామని తెలిపారు. 'ఖుషి' తరహా ప్రేమకథను తెరపై చూసి చాలా కాలమైందని, వరుసగా యాక్షన్ చిత్రాలు వస్తున్న తరుణంలో తమ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ మధుమిత సర్కార్, మధురిమ, అంజి, భార్గవ నౌండ్ల తదితరులు పాల్గొన్నారు.







## సూర్యతో నజ్రియా.. 'సీన్'తో లీఎంట్రీ!

**హైదరాబాద్:** ప్రముఖ నటి నజ్రియా నజీమ్ కొంతకాలం విరామం తర్వాత తమిళ చిత్ర పరిశ్రమలోకి తిరిగి వస్తున్నారు. సూర్య హీరోగా నటిస్తున్న 'సీన్' చిత్రంలో కథానాయికగా కనిపించనున్నారు. జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నజ్రియా 'మాయ' పాత్ర పోషిస్తున్నారు. నవంబర్ 6న దీపావళి సందర్భంగా తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. సూర్యతో నజ్రియా తొలిసారి జోడీ కడుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# సౌత్ నటిననే వివక్ష చూపారు

## : కరణ్ జోహార్‌పై రెజీనా సంచలన ఆరోపణలు



ప్రముఖ నటి రెజీనా కసాండ్రా బాలీవుడ్‌పై, ముఖ్యంగా దర్శక నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తాను నటించిన 'కేసరి చాప్టర్ 2' సినిమా ప్రమోషన్లలో తనను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టారని, దక్షిణాది నటిని కావడం వల్లే ఈ వివక్ష ఎదురైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె వ్యాఖ్యలు భారత సినీ పరిశ్రమలో 'నార్త్ వర్సెస్ సౌత్' చర్చను మరోసారి రాజేశాయి.

అక్షయ్ కుమార్ హీరోగా నటించిన 'కేసరి 2'లో ఆయన భార్యగా కీలక పాత్ర పోషించినప్పటికీ, ప్రమోషన్ల సమయంలో తన పేరును తొలగించారని రెజీనా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. "నాపై చిత్రీకరించిన పాటను విడుదల చేసి, సోషల్ మీడియాలో కనీసం ట్యాగ్ కూడా చేయలేదు. నేను సౌత్ ఇండియన్ నటిని కావడం వల్లే ఇలా చేశారా?" అని ఆమె ప్రశ్నించారు.ఇటీవల సౌత్ సినిమాలపై జాన్వీ కపూర్, రాధికా ఆప్టే చేసిన వ్యాఖ్యలపైనా ఆమె తీవ్రంగా స్పందించారు. ఉత్తరాది నటులు ఇలా బహిరంగంగా మాట్లాడటం వల్ల అనవసరంగా నార్త్-సౌత్ విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. "ఒకవేళ సౌత్ సినిమాలలో పనిచేయడం ఇబ్బందిగా అనిపిస్తే, ఆ ప్రాజెక్ట్‌ల నుంచి బయటకు వెళ్లిపోవాలి. అంతేకానీ తర్వాత దాని గురించి మాట్లాడటం సరికాదు" అని ఆమె సూటిగా అన్నారు.బాలీవుడ్‌లో తనకు ఎదురైన అనుభవాన్ని, తోటి నటుల వ్యాఖ్యలను ముడిపెడుతూ రెజీనా చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అయితే, రెజీనా ఆరోపణలపై ఇప్పటివరకు ధర్మ ప్రొడక్షన్స్ గానీ, కరణ్ జోహార్ గానీ స్పందించలేదు.

# సాయి దుర్గ తేజ్, కిరణ్ నిశ్చితార్థం..

మెగా కుటుంబంలో మరో శుభకార్యం జరిగింది. నటుడు సాయి దుర్గ తేజ్, కిరణ్ నిశ్చితార్థం గురువారంనవంబర్ 5, 2026.. హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని హిల్టన్ హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రిసార్ట్‌లో ఈ వేడుకను నిర్వహించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఈ జంట కొత్త జీవితానికి తొలి అడుగు వేసింది. సాయి దుర్గ తేజ్, కిరణ్ నిశ్చితార్థ వేడుకకు కొణిదెల, అల్లు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయి దుర్గ తేజ్ తల్లిదండ్రులు డాక్టర్ శివప్రసాద్, విజయదుర్గ, సోదరుడు వైష్ణవ్ తేజ్ ఈ వేడుకలో పాల్గొన్నారు. మెగాస్టార్ చిరంజీవి, సురేఖ కొణిదెల, రామ్ చరణ్ కూడా హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. ఇక ఈ అమ్మాయి గురించి సోషల్ మీడియాలో తెగ సెర్చ్ చేస్తున్నారు. కాగా ఈ అమ్మాయి పూర్తి పేరు కిరణ్మయి అని తెలుస్తోంది. సాయి దుర్గ కేష్ కి ఎన్నో రోజుల నుంచి స్నేహితురాలు అని.. స్నేహమే ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లికి దారి తీసినట్లు తెలుస్తోంది. ఇక అల్లు అర్జున్ తన భార్య స్నేహారెడ్డితో కలిసి ఈ వేడుకకు వచ్చారు. అల్లు బాబీ, నీలా షా, వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి, వారి కుమారుడు వాయువ తేజ్ కూడా నిశ్చితార్థంలో సందడి చేశారు. నాగబాబు, పద్మజ, నిహారిక కొణిదెల, అల్లు అరవింద్, అల్లు నిర్మల, అల్లు శిరీష్, నయనికా రెడ్డి కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. అకీరా నందన్, ఆద్య కూడా ఈ కుటుంబ వేడుకకు హాజరయ్యారు. సాయి దుర్గ తేజ్ నిశ్చితార్థానికి కుటుంబ సభ్యులతో పాటు పలువురు స్నేహితులు, సినీ ప్రముఖులు కూడా వచ్చారు. మంచు మనోజ్, భూమా మౌనిక రెడ్డి, నవీన్ విజయకృష్ణ, హర్ష చెముడు, వెంకీ కుడుముల, నవదీప్, హర్షిత్ రెడ్డి ఈ వేడుకలో పాల్గొన్నారు. ఇక సాయి దుర్గ తేజ్, కిరణ్ వివాహం డిసెంబర్ 10, 2026న హైదరాబాద్‌లో జరగనుంది.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613